ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
గురు-01-2025
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 138 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## ఇస్రోకు 'వంద'నం

✍ జయభేరి, శ్రీహరికోట, జనవరి 29

ఇస్రో వందో రాకెట్ ప్రయోగం తిరుపతిలోని శ్రీహరికోట వేదికగా బుధవారం ఉదయం జరిగింది. షార్ నుంచి ఉదయం 6:23 గంటలకు శాస్త్రవేత్తలు జీఎస్ఎల్వీ ఎఫ్ 15 (GSLVF15) రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. నిప్పులు చిమ్ముతూ ఈ రాకెట్... ఎన్వీఎస్ 02 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లింది. ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. ఈ శాటిలైట్ స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. దీని బరువు 2,250 కిలోలు. కొత్త తరం నావిగేషన్ ఉపగ్రహాల్లో ఇది రెండోది. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్‌కు ఇది తొలి ప్రయోగం కావడంతో ఆయనే అన్ని ప్రక్రియలనూ స్వయంగా పర్యవేక్షించారు. ఎన్వీఎస్ 02 ఉపగ్రహం.. ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. భౌగోళిక, వైమానిక, సముద్ర నావిగేషన్ కోసం ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. వ్యవసాయంలో సాంకేతికత, విమానాల నిర్వహణ, మొబైల్ పరికరాల్లో లొకేషన్ ఆధారిత సేవలు అందించనుంది. అలాగే, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు ఈ ఉపగ్రహపు నావిగేషన్ వాడుకోవచ్చు. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం

...మిగతాది 2 లో

## ఆరు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్

✍ జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 29:

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఏపీ, తెలంగాణలో 3 చొప్పున స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. అదే నెల 27న పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఏపీలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ఉపాధ్యాయ స్థానానికి పోలింగ్ జరగనుంది.అటు, తెలంగాణలో 2 ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే, వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి సైతం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల్లో వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. కాగా, మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ జీవన్ రెడ్డి కొనసాగుతుండగా.. ఇదే చోట టీచర్ స్థానం నుంచి కూర రఘోత్తంరెడ్డి, వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ స్థానం నుంచి అలుగుబెల్లి నర్సిరెడ్డి కొనసాగుతున్నారు. వీరి పదవీ కాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది. నోటిఫికేషన్ విడుదల ఫిబ్రవరి 3, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 10, నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 11, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 13, పోలింగ్ ప్రక్రియ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ.. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మార్చి 3,

## సౌదీలో రోడ్డు ప్రమాదం
### 9 మంది భారతీయులు దుర్మరణం

- జయభేరి, న్యూ డిల్లీ జనవరి 29:

పశ్చిమ సౌదీ అరేబియాలో జిజాన్ సమీపాన ఒక రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది భారత జాతీయులు దుర్మరణం చెందారని జెడ్డాలోని భారత దౌత్య కార్యాలయం బుధవారం వెల్లడించింది. తాము పూర్తి సహాయం అందజేస్తున్నామని, అధికారులు, కుటుంబాలను సంప్రదిస్తున్నామని కార్యాలయం తెలియజేసింది. 'సౌదీ అరేబియా రాజ్యం పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపాన ఒక రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది భారత జాతీయుల దుర్మరణానికి మేము ఎంతో విచారిస్తున్నాం' అని భారతీయ కాన్సులేట్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నది.'బాధిత కుటుంబాలకు మా ప్రగాఢ సంతాపం. జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ పూర్తి సహాయం అందజేస్తున్నారు. అధికారులు, కుటుంబాలను సంప్రదిస్తున్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కూడా ఆకాంక్షిస్తున్నాం. మరిన్ని ప్రశ్నల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైంది' అని కాన్సులేట్ తెలిపింది. ప్రమాదం, ప్రాణ నష్టం గురించి తెలిసి 'విచారిస్తున్నాన'ని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు.



# పర్యాటక విధానం సిద్ధం కావాలి

దేశవ్యాప్తంగా భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా టూరిజం ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. టూరిజం పాలసీపై సమీక్షించిన ఆయన.. పలు కీలక సూచనలు చేశారు. ఫిబ్రవరి 10 వ తేదీలోగా అత్యుత్తమ పర్యాటక విధానం సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

✍ జయభేరి, హైదరాబాద్ :

ఫిబ్రవరి 10 వ తేదీలోగా అత్యుత్తమ పర్యాటక విధానం సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల్లోని అత్యుత్తమ పాలసీని అధ్యయనం చేసి తెలంగాణ పర్యాటక పాలసీని రూపొందించాలని చెప్పారు.

బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టూరిజం పాలసీపై సమీక్షించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా పాలసీ ఉండాలన్నారు. ప్రధానంగా టెంపుల్, ఎకో టూరిజంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

"రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ఆస్కారం ఉన్న, అవసరమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలి. సింగపూర్ తరహా ఎకో టూరిజం విధానాలను పరిశీలించాలి. సమ్మక్కసారలమ్మ జాతర జరిగే సమయంలో భక్తులు, పర్యాటకులను ఆకర్షించేందుకు రెవెన్యూ, అటవీ, పర్యాటక శాఖలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. జాతరతో పాటు సమీప పర్యాటక ప్రాంతాలు, ఆలయాలను కలుపుతూ ఒక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలి. ఆదిలాబాద్, వరంగల్, నాగార్జునసాగర్ లాంటి ప్రాంతాలలో ఎకో టూరిజంను మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలి. వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలకు దేశవ్యాప్తంగా భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. హైదరాబాద్ నగరంలో హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలి. పర్యాటక అభివృద్ధితో రాష్ట్రానికి మరింత గుర్తింపు, ఆదాయం వచ్చేలా ఈ పాలసీని రూపొందించాలి" అని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

...మిగతాది 2 లో

## ఏపీ శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం




- ముప్పై సంవత్సరాల తర్వాతర రాష్ట్రానికి బహుమతి
- రిపబ్లిక్‌డే పెరేడ్‌లో యావత్ దేశాన్ని ఆకట్టుకున్న శకటం...
- ఏటికొప్పాక బొమ్మల రాజసానికి జ్యూరీ అవార్డు ప్రకటించిన కేంద్రం
- అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

✍ జయభేరి, న్యూఢిల్లీ:

దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని చేతి వృత్తుల కళా ప్రాముఖ్యతను చాటుతూ, ఆంధ్ర రాష్ట్ర వారసత్వ సాంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఏటి కొప్పాక బొమ్మలతో రూపొందించి, ప్రదర్శించిన శకటం రిపబ్లిక్ డే పెరేడ్ ఉత్సవాలకే హైలెట్‌గా నిలిచి యావత్ దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షించింది. సామాజిక మాధ్యమాల్లో సైతం లక్షలాది మంది ఈ శకటానికి మంత్రముగ్ధులై, ప్రశంసలతో ముంచెత్తారు. రాష్ట్రంలో చేతివృత్తులు, హస్తకళలకు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఈ శకటాన్ని రూపొందించింది. శకటం ముందు వినాయకుడు, చివర కలియుగ

...మిగతాది 2 లో



## కుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మృతి

- బాధితులకు 25 లక్షల చొప్పున ప్రకటించిన యోగి ప్రభుత్వం

మహాకుంభ మేళా తొక్కిసలాట ఘటన మృతి చెందిన వారి సంఖ్యను అధికారులు ధృవీకరించారు. కనీసం 30 మంది మరణించినట్టుగా ప్రకటించారు.

బుధవారం తెల్లవారుజామున మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో కనీసం 30 మంది మరణించారు. 60 మంది గాయపడ్డారు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఇన్ జనరల్ వైభవ్ కృష్ణ ప్రయాగ్‌రాజ్‌లో విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మృతుల్లో 25 మందిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో 36 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, మిగిలిన వారిని వారి కుటుంబాలతో పంపించారు. భక్తుల తోపులాట కారణంగా ఈ సంఘటన అర్ధరాత్రి 1 గంటల నుంచి 2 గంటల మధ్య జరిగింది. జనం బారికేడ్లను దూకి అవతలి వైపునకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. 90 మందికి పైగా గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. వారిలో 30 మంది మరణించారని విలేకరుల సమావేశంలో డీఐజీ చెప్పారు. ప్రాణనష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరించారు. గణాంకాలను విడుదల చేయడానికి అధికారులు 16 గంటలకు పైగా సమయం తీసుకున్నారు. ఈ సంఘటనను అత్యంత విచారకరం అని, ప్రధాని మోదీ సంతాపాన్ని తెలిపారు. ఊరేగింపు కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను యాత్రికులు దూకేందుకు ప్రయత్నించినప్పుడు తొక్కిసలాట జరిగిందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇస్రోకు 'వంద'నం

అవతల 1500 కి.మీ పరిధి వరకూ యూజర్లకు కచ్చితమైన నావిగేషన్ అందిస్తుందిఇస్రో వందో ప్రయోగం సక్సెస్ కావడంపై ఛైర్మన్ నారాయణన్ హర్షం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది చేపట్టిన తొలి ప్రయోగం విజయవంతమైందని చెప్పారు. నావిగేషన్ శాటిలైట్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. 'ఈ వందో ప్రయోగం మైలురాయిగా నిలుస్తుంది. ఎన్‌వీఎస్ 02 ఉపగ్రహం పదేళ్ల పాటు సేవలందిస్తుంది. ఇప్పటివరకూ 6 జనరేషన్ల లాంచ్ వెహికల్స్ అభివృద్ధి చేశాం. 1979లో అబ్దుల్ కలాం నేతృత్వంలో తొలి లాంచ్ వెహికల్ ప్రయోగం జరిగింది. ఇప్పటివరకూ శ్రీహరికోట వేదికగా 100 ప్రయోగాలు జరిగాయి. 100 ప్రయోగాల్లో 548 శాటిలైట్లను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా పంపాం. 3 చంద్రయాన్, మాస్ ఆర్బిటర్, ఆదిత్య, ఎస్‌ఆర్‌ఈ మిషన్లు చేపట్టాం.' అని నారాయణన్ వివరించారు.

## పర్యాటక విధానం సిద్ధం కావాలి

**కుటుంబ సర్వేపై సమీక్ష:**
రాష్ట్రంలో విజయవంతంగా పూర్తి చేసిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) కు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. బుధవారం సమగ్ర కుల గణనపై సమీక్షించిన ఆయన పలు కీలక అంశాలను పేర్కొన్నారు. కుల గణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. "రాష్ట్రంలో గత ఏడాది నవంబర్ 6 వ తేదీన ఈ సర్వే ప్రారంభం కాగా, అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారం నాటికి సర్వే పూర్తయింది. రాష్ట్రంలోని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించగా, ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. దాదాపు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు విజయవంతంగా సేకరించాయి. వీటికి సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి చేశాయి" అని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఫిబ్రవరి 2 వ తేదీలోగా నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.

## ఏపీ శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం

ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఎత్తైన రూపాలతో, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టు ప్రతిభింభించేలా అమర్చిన ఏటికొప్పాక బొమ్మల కొలువుతో శకటం ఆద్యంతం ఆకట్టుకుంది. శకటం నడుస్తున్నంత సేపు ఏటి కొప్పాక బొమ్మల ప్రాశస్త్యాన్ని చాటుతూ ''బొమ్మలు బొమ్మలు ఏటికొప్పాక బొమ్మలు, ఆంధ్రప్రదేశ్ బొమ్మలు, ఇవి విద్యను నేర్పే బొమ్మలు, వినోదాల బొమ్మలు, భక్తి చాటే బొమ్మలు, హస్తకళల హంగులు, సహజ ప్రకృతి రంగులు'' అంటూ సాగే గీతంతో ప్రజలందరి హృదయాలను దోచుకుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సైతం ఈ శకటం మనోహరమైన రూపాన్ని చూసి పులకించిపోయారు. అలాగే నెటిజన్లు సైతం ఏపీ ప్రదర్శించిన ఏటి కొప్పాక బొమ్మల శకటాన్ని పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. చాలా మంది నెటిజన్లు తమ సామాజిక మాధ్యమ సాధనల్లో తమ డీపీలుగా కూడా ఈ శకటాన్ని ప్రదర్శించారు. ఓటింగ్‌లో కూడా పెద్ద ఎత్తున ఏటికొప్పాక శకటానికి మద్దతు పలికారు.


30 సంవత్సరాల తర్వాత తొలిసారి దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో ప్రదర్శించే శకటాలకు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం లభించింది. ఏటికొప్పాక బొమ్మల శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ తృతీయ బహుమతి ప్రకటించింది.ఏటికొప్పా శకటానికి రిపబ్లిక్ డే సందర్భంగా ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు ఇద్దరూ తమ సామాజిక మాధ్యమాల వేదికగా ఈ శకటాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. దశాబ్దాల తర్వాత రాష్ట్ర శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం లభించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఏటి కొప్పాక బొమ్మలకు జియో ట్యాగింగ్ చేసి, ఈ బొమ్మలను అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

## కుంభమేళా తొక్కిసలాటలో

ఆదిత్యనాథ్ టెలివిజన్ ప్రకటనలో తెలిపారు. మహాకుంభ మేళా2025 తొక్కిసలాటపై న్యాయ విచారణను యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. ముగ్గురు సభ్యుల న్యాయ కమిషన్‌కు నెల రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది. 'ఈ సంఘటన హృదయ విదారకమే కాదు మాకు పాఠం కూడా.' అని యోగి ఉద్వేగభరితంగా మాట్లాడారు. రిటైర్డ్ జస్టిస్ హర్ష్ కుమార్ నేతృత్వంలోని జ్యుడీషియల్ ప్యానెల్‌లో మాజీ డీజీపీ వీకే గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీకే సింగ్ ఉన్నారు. తొక్కిసలాటకు గల కారణాలు, పరిస్థితులను పరిశోధించడంతోపాటు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని న్యాయ కమిషన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు యోగి తెలిపారు. 'అకస్మాత్తుగా గుంపులో తోపులాట జరిగింది. మేము చిక్కుకుపోయాం. మాలో చాలా మంది కింద పడిపోయారు. గుంపు అదుపు లేకుండా పోయింది. దీంతో తొక్కిసలాట జరిగింది. బయటకు వెళ్లే అవకాశం లేదు, అన్ని వైపుల నుండి నెట్టడం జరిగింది.' అని ప్రత్యక్షసాక్షి సరోజిని చెప్పారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో బెలగావికి చెందిన కనీసం నలుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని కర్ణాటక పోలీసులు బుధవారం ధృవీకరించారు. బెలగావి జిల్లా కమిషనర్ మహ్మద్ రోషన్ మరణాల గురించి ప్రకటించారు. ఫోన్‌లో మీడియాకు తెలిపారు. మృతదేహాలను తిరిగి తీసుకురావడానికి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లేందుకు సీనియర్ జిల్లా అధికారి, పోలీసు అధికారి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది.

## జూన్ లోగా అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



✍ **జయభేరి, అమరావతి జనవరి 29 :**

జూన్ లోగా అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూసే బాధ్యత ఎమ్మెల్యేలదేనని సిఎం సూచించారు. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్ చార్జులతో టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. త్వరలో 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులకు నియామకాలు ఉంటాయని తెలియజేశారు. కష్టపడిన నేతలు, కార్యకర్తలకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. 2029 లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని కోరారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో బాగా పనిచేసిన వారికే పదవులు ఇస్తామని చంద్రబాబు చెప్పారు.

# ఇండియా.. ఇప్పుడు సూపర్ పవర్

**భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యాంగా ఎదుగుతోంది. దీంతో పాటే.. భారత రక్షణ సామర్థ్యాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. భారత్ అమ్ములపొదిలో కొత్త కొత్త ఆయుధాలు వచ్చి చేరుతున్నాయి. ముఖ్యంగా, ఆత్మనిర్భర్ భారత్ తన సొంత టెక్నాలజీతో ప్రపంచం ఉలిక్కిపడే ఆయుధాలను తయారు చేస్తోంది. ఇందులో భాగంగానే.. ఈ రిపబ్లిక్ డే పెరేడ్‌లో రెండు కీలక ఆయుధాలను దేశానికి పరిచయం చేయబోతున్నారు.**



శత్రు దేశాల వెన్నులో వణుకుపుట్టించే ఈ క్షిపణులు 75 ఏళ్ల గణతంత్ర దినోత్సవ వేడుకలో మరింత ప్రత్యేకంగా నిలిచాయిభారత్ అంటేనే ఇప్పుడు ప్రపంచమంతా అలెర్ట్ అవుతోంది. అంతర్జాతీయంగా భారతదేశ పరపతి అగ్రదేశాలకు దాదాపు సమానమయ్యింది. ముఖ్యంగా, రక్షణ రంగంలో భారత్ తన సత్తా ఏంటో ప్రపంచానికి చూపిస్తోంది. "ఎప్పుడొచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా.. లేదా" అనే లెవల్లో... ఒకప్పుడు, కాస్త వీక్‌గా ఉన్న భారత రక్షణ రంగం... ఇప్పుడు సగర్వంగా ఛాతి చూపి నిలుస్తోంది. జబ్బ చరిచి కమాన్ అనే స్థాయికి వెళ్లింది. బంగ్లాదేశ్ లాంటి తోక ఊపుళ్లకే కాదు.. ఆగర్భ శత్రువు పాకిస్తాన్‌తో పాటు.. చారిత్రక ఎనిమీ చైనాలకు కూడా చెమటలు పట్టించేంతగా భారత్ రక్షణ సామర్థ్యం పెరిగింది.ఇప్పుడు, అగ్ర రాజ్యాలను సైతం కించింతైనా కేర్ చేయని స్థాయిలో భారత్ త్రివధ దళాలు బలం పుంజుకున్నాయి. ఒకప్పుడు, దిగుమతులపై ఆధారపడిన భారత్ రక్షణ రంగం.. 75 ఏళ్ల గణతంత్రం జరుపుకునే నాటికి ప్రపంచానికి సరికొత్త ఆయుధాలను పరిచయం చేస్తోంది. ఫ్రాన్స్ లాంటి అగ్రదేశాలు కూడా భారత్ ఆయుధాలపై ఆసక్తి చూపుతున్నాయి. దటీజ్ భారత్ అనే విధంగా భారతదేశం తన వెపనరీని అభివృద్ధి చేసుకుంది. అందులో, సరికొత్తగా రెండు కీలకమైన ఆయుధాలను ఈ రిపబ్లిక్ డేలో ప్రదర్శిస్తున్నారు.శత్రుదేశాల కుతంత్రాలను ధీటుగా ఎదుర్కోవాలంటే రక్షణ రంగంలో మెరుగైన ఆయుధ సంపత్తి అవసరం. అందుకే భారత్ కొన్నేళ్లుగా దీనిపై దృష్టి సారించింది. అనేక స్వదేశీ ఆయుధాలను సిద్ధం కూడా చేసింది. అందులో అత్యంత ముఖ్యమైంది పినాక. భారత భూభాగంపై కన్నేసిన చైనాకు షాకిచ్చే విధంగా భారత తన సొంత టెక్నలజీతో ఈ కొత్త వెపన్‌ను తయారుచేసింది. ఇటీవల కాలంలో అభివృద్ధి చేసిన ఈ పినాక ఎంకే 1ను భారత్ ఈ గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించనుంది. భారీ లక్ష్యాలను సైతం ఛేదించగల పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్, ప్రత్యర్థి తేరుకునేలోపే టార్గెట్‌ను బూడిదగా మార్చేస్తుంది.సాయుధ బలగాల కార్యచరణ సంసిద్ధతను మెరుగుపరచడంలో భాగంగా.. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో పినాక రెజిమెంట్‌లను మోహరిస్తున్నారు. పినాక మార్క్ 1 కు 45 కి.మీ., మార్క్ 2 కు 65 కి.మీ. పరిధి ఉంది. పినాక వ్యవస్థ 44 సెకండ్లలో 12 హై ఎక్స్‌ప్లోజివ్ రాకెట్లను పేల్చగలదు. ఈ వ్యవస్థ తేలిగ్గా రవాణా చెయ్యగలిగేలా, టాటా ట్రక్కుపై మోహరించి ఉంటుంది. ఇది మొదట కార్గిల్ యుద్ధంలో పాల్గొంది. పర్వతాలపై ఉన్న శత్రు దళాలను విజయవంతంగా నిర్వీర్యం చేసింది. తర్వాత, దీన్ని భారత సైన్యంలో పెద్ద సంఖ్యలో చేర్చుకున్నారు.2014 నాటికి, ఏటా 5,000 పినాక రాకెట్లు ఉత్పత్తిలో ఉన్నాయి. ఎక్కువ పరిధి, అధిక కచ్చితత్వం కలిగిన మెరుగైన పినాక అభివృద్ధి దశలో ఉంది. ఈ పినాక వ్యవస్థ ధర రూ.2.3 కోట్లు. పినాక ఒక సంపూర్ణ రాకెట్ వ్యవస్థ. ఒక్కో పినాక బ్యాటరీలో... ఒక్కో దానిలో 12 రాకెట్లు కలిగిన 6 లాంచరు వాహనాలు, 3 రాకెట్ సరఫరా వాహనాలు, ఫైర్ కంట్రోల్ కంప్యూటర్ ఉన్న 2 కమాండ్ పోస్ట్ వాహనాలు ఉంటాయి. ఇందులో ఒక డిజికోరా మెట్ రాడార్ వ్యవస్థ కూడా ఉంటుంది. 6 లాంచర్లు కలిగిన ఈ బ్యాటరీ.. 1000 మీ విస్తీర్ణంలోని ప్రాంతాన్ని నిర్వీర్యం చెయ్యగల సార్థ్యంతో పనిచేస్తుంది. ఇలాంటి, 72 రాకెట్లు కలిగిన బ్యాటరీని సైన్యం మోహరిస్తుంది.ఈ రాకెట్లన్నిటినీ 44 సెకండ్లలో పేల్చొచ్చు. ఇక, ప్రస్తుత ప్రపంచ ఉద్రిక్తతల మధ్య చాలా దేశాలు మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ల పట్ల ఆసక్తిని కనబరుస్తున్న తరుణంలో.. పినాక రాకెట్‌ను ఆర్మేనియాకు కూడా సరఫరా చేయడం ప్రారంభించింది. అత్యంత శక్తివంతమైన ఈ స్వదేశీ పినాక రాకెట్‌పై ఇటీవల ఆగ్నేయాసియా, యూరప్‌లోని అనేక దేశాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. అంతెందుకు, ప్రపంచంలోని అతి శక్తిమంతమైన దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్... M51 జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధ విమానాలు, లుక్‌లెహ్ శతఘ్నుల వంటి అధునాతన ఆయుధ వ్యవస్థలు ఉన్నప్పటికీ... భారత్‌కు చెందిన పినాకను కావాలనుకుంటోంది. ఇందులో భాగంగా, గతేడాది నవంబర్ నుండి ఫ్రెంచ్ ఆర్మీ అధికారులు భారత్‌తో చర్చలు జరుపుతున్నారు.ఇక, మరో అత్యద్భుతమైన ఆయుధాన్ని కూడా ఈ రిపబ్లిక్ డేలో భారత్ ప్రదర్శిస్తోంది. మొట్టమొదటిసారిగా పరేడ్‌లో ప్రళయ్ మిస్సైల్ కన్పించనుంది. ఇది శత్రువులకు సవాలుగా మారే అత్యాధునిక ఆయుధం. డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఈ మిస్సైల్ భారత్ శక్తి సామర్థ్యాలకు ఓ మచ్చుతునక. సరిహద్దు రక్షణలో ప్రళయ్ మిస్సైల్ కీలకంగా మారుతుంది. చైనా, పాక్‌లకు చెక్ పెట్టాడానికి, ప్రత్యేకంగా ప్రళయ్‌ను ఎల్‌ఐసీ, ఎల్‌ఓసీ వెంట మొహరించేందుకు రూపకల్పన జరిగింది.శత్రువుల వ్యూహాల్ని ఇది ధ్వంసం చేయగలదు. ఇతర మిస్సైల్స్‌తో పోలిక ప్రళయ్ మిస్సైల్‌ను చైనాకు చెందిన డోంగ్ ఫెంగ్ 12, రష్యాకు చెందిన ఇస్కాండర్ మిస్సైల్‌కు సమానమని తెలుస్తోంది. ఈ మిస్సైల్ యుద్ధ మైదానంలో శత్రువులకు దీటైన సమాధానం చెబుతుంది. ప్రళయ్ మిస్సైల్ సాంకేతిక ప్రత్యేకతలు ఈ మిస్సైల్ 350 కిలో మీటర్ల నుండి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు. అలాగే, 500 నుండి 1000 కిలోల వరకూ పేలోడ్ తీసుకెళ్లగలదు. లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ DRDO అభివృద్ధి చేసిన ఈ వార్ వెపన్.. భూ ఉపరితలం నుండి ఉపరితలం నుండి ప్రయోగించగలిగిన స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. అత్యంత కచ్చితత్వంతో ఛేజ్ చేయగలిగిన ఈ మిస్సైల్‌ను మొబైల్ లాంచర్లతో ప్రయోగించొచ్చు. వీటిని క్వాసీ బాలిస్టిక్ మిస్సైల్స్‌గా పిలుస్తారు. ఇవి బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైల్స్ రెండింటి లాగా పని చేస్తాయి. భారత రక్షణ రంగ వ్యూహంలో భాగంగా దేశ ఉత్తర సరిహద్దులను బలోపేతం చేయడానికి ప్రళయ్ క్షిపణి సేవలను వినియోగిస్తున్నారు.ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగించిన 'ప్రలే' క్షిపణి, చైనా 'డాంగ్ ఫెంగ్ 12', రష్యా 'ఇస్కాండర్', దక్షిణ కొరియా హ్యూన్మూ2తో పోల్చదగని ప్రళయ్‌ను ఇప్పుడు భారత్‌లోనే భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటికే, ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌ల కోసం దాదాపు 500 వందల ప్రళయ్ క్షిపణులు ఆర్డర్‌లో ఉన్నాయి.ఇక, భారత సైన్యం, నిఘా సామర్థ్యాలను ఆధునీకరించే దిశగా భారత్ కీలక వ్యవస్థలను కూడా రూపొందిస్తోంది.

తాజాగా, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఓ యుద్ధభూమి నిఘా వ్యవస్థను ప్రారంభించారు. సంజయ్ అనే పేరుతో ఉన్న ఈ అధునాతన ఆటోమేటెడ్ సిస్టమ్.. గ్రౌండ్, ఏరియల్ సెన్సార్‌ల నుండి డేటాను సేకరిస్తుంది. ఈ ఇన్‌పుట్‌లు ఆర్మీ డేటా నెట్‌వర్క్, శాటిలైట్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఏకికృతం చేసి, కచ్చితత్వాన్ని నిర్ధారిస్తాయి. ఈ వ్యవస్థ యుద్ధభూమిలో ఏం జరుగుతుందో.. అద్దంలా చూపిస్తుంది.దీని ద్వారా, ఆర్మీ కమాండ్, హెడ్‌క్వార్టర్స్‌కు కేంద్రీకృత వెబ్ అప్లికేషన్‌తో నిర్ణయం తీసుకోవడానికి అవసరమయ్యే ఖచ్చితమైన, రియల్‌టైమ్ సమచారాన్ని అందిస్తుంది. అత్యాధునిక సెన్సార్‌లు, అత్యాధునిక విశ్లేషణలతో రూపొందించిన 'సంజయ్' భారత భూ సరిహద్దులను పర్యవేక్షించడం, చొరబాట్లను నిరోధించడం, అనుమానమున్న పరిస్థితులపై అవగాహన కల్పించే విధంగా పనిచేస్తుంది. ఇది, ఇంటెలిజెన్స్, నిఘా కార్యకలాపాలలో కీలకంగా ఉంటుంది. ఇది భవిష్యత్ యుద్ధభూమిలో విప్లవాత్మక ఫలితాలను అందిస్తుందిభారత్ యుద్ధ సామర్థ్యం మామూలుగా లేదు. ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యం కలిగిన మూడో దేశంగా ఉన్న భారత్‌ను ఎదుర్కోవాలంటే మూడు చెరువుల నీళ్లు తాగాల్సిందే. ఇండియాన్ ఆర్మీ పవర్ తెలిపే ఒక మాట ఇక్కడ చెప్పాలి. "ఒక సైన్యంలో.. బ్రిటీష్ ఆఫీసర్, అమెరికన్ వెపన్స్, భారత సైన్యం ఉంటే... దాన్ని ఎవ్వరూ ఓడించలేరంట". ఈ పాత కాలం నాటి నానుడికి ఇప్పుడు సరికొత్త మార్పు తోడయ్యింది. లేటెస్ట్ టాక్ ఏంటంటే.. "ఇండియన్ ఆఫీసర్, ఇండియన్ సైన్యం, ఇండియా వెపన్స్ ఉంటే.." ఎవ్వరైనా అడుగు ముందుకెయ్యాలంటే హడలిపోవాల్సిందే! ఎందుకంటే, అలాంటి అత్యాధునిక ఆయుధాలు ఇప్పుడు భారత్ సొంతం.అలాగే, క్రూయిజ్ క్షిపణుల్లో భాగంగా.. హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్, నిర్భయా మిస్సైల్, బ్రహ్మోస్NG లను కూడా అభివృద్ధి చేస్తోంది. ఇక, 'నాగ్' పేరుతో యాంటీగైడెడ్ ట్యాంక్ మిస్సైళ్లను కూడా రూపొందిస్తోంది. ఇక, న్యూక్లియర్ ట్రయాడ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్న ప్రపంచంలోని 6వ దేశంగా భారత్ ఉంది. భూమి, నీరు, గాలి నుండి కూడా అణుదాడి చేయగల సామర్థ్యం భారత్ సొంతం. సో.. రక్షణ రంగంలో భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతుందనడాన్ని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి. దీన్ని బట్టి, ఇకపై కూడా.. భారత్, తన సార్వభౌమత్వాన్ని, మాతృభూమిని ఏ ఇతర దేశం మద్దతు లేకుండా ఒంటరిగా కాపాడుకోగలదు.శత్రు దేశాలకు ధీటుగా.. అత్యాధునిక ఆయుధాలతో, భారత్ ఇప్పుడు తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటుంది. ఇక, రాబోయేది ఏ యుద్ధం అయినా.. అది ఎవరితో అయినా.. భారత్ రెడీ!

# ద్విముఖ పోరుగా మారిన ఢిల్లీ ఎన్నికలు




✍ **జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 29:**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్ పార్టీ తన మిత్రపక్షాల మద్దతు సమకూర్చుకోలేకపోతోంది. ఇప్పటికే ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షాలైన సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శరద్ పవార్ వర్గం సహా మరికొన్ని ఇండి కూటమి పార్టీలు కాంగ్రెస్‌ను కాదని ఆమ్ ఆద్మీ పార్టీ కి మద్దతు ప్రకటించాయి. ఇప్పుడు ముస్లిం ఓటర్లలో పట్టున్న 'ఆలిండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్' అధినేత మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ కూడా కాంగ్రెస్‌ను కాదని ఆప్ వైపు నిలిచారు. లౌకికవాదుల ఓట్లు చీలకుండా చూడాలని, ఈ క్రమంలో ముస్లిం ఓటర్లంతా కేజ్రీవాల్‌కే ఓటేసి గెలిపించాలని అజ్మల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇప్పటికే మిత్రపక్షాల్లో ఒక్కొక్క పార్టీ కాంగ్రెస్‌ను కాదని ఆప్‌కు మద్దతు ప్రకటిస్తుండగా.. మైనారిటీ ఓట్లపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అజ్మల్ ప్రకటన మరొక శరాఘాతంగా మారింది. దేశంలో పరిస్థితులు అత్యంత సమస్యాత్మకంగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో సెక్యులర్ ఓట్లను విభజించవద్దని అజ్మల్ వారించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల్లో భారతీయ జనతా పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ తో పాటు గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ కూడా ఉంది. పూర్తిగా పట్టణ ప్రాంత ఓటర్లు ఢిల్లీలో ఒకప్పుడు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం తర్వాత ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మిత్రపక్షాల మద్దతుతో దేశవ్యాప్తంగా కొంత పుంజుకున్న కాంగ్రెస్.. ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో పరాభవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా గెలుపొంది, తన పూర్వవైభవాన్ని చాటుకోవాలని తహతహలాడింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా బరిలోకి దిగి గెలుపు కోసం శ్రమిస్తోంది. కాంగ్రెస్ ప్రయత్నాలతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ముక్కోణపు పోటీగా మారాయి. ముస్లిం మైనారిటీలు, దళిత వర్గాల్లో పట్టున్న కాంగ్రెస్ పార్టీ.. ఆ వర్గాలు ఎక్కువ సంఖ్యలో నివసించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే ఇది పరోక్షంగా భారతీయ జనతా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారింది. ముస్లిం మైనారిటీ, దళిత ఓట్లను కాంగ్రెస్ పార్టీ చీల్చితే.. మిగతా ఓట్లలో మెజారిటీ ఓట్లను బీజేపీ కైవసం చేసుకోవడం సులభతరమవుతుంది. ఒకవేళ ఈ వర్గాలు ఆమ్ ఆద్మీ పార్టీ వెంట నిలిస్తే.. బీజేపీ గెలుపు కష్టతరమవుతుంది. ఈ పరిస్థితిని గ్రహించిన ఇండికూటమి పార్టీలు.. కాంగ్రెస్ ప్రయత్నాలను బహిరంగంగా విమర్శించకపోయినా.. తమ మద్దతు కేజ్రీవాల్‌కు ప్రకటించి ముక్కోణపు పోటీని కాస్తా ద్విముఖ పోరుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. తద్వారా ఆప్ విజయావకాశాలను దెబ్బతీయకుండా కాపాడాలని చూస్తున్నాయి. అస్సాం నేత బద్రుద్దీన్ అజ్మల్ ప్రకటన ఈ కోవలోనిదేనని అర్థమవుతోంది.ముస్లిం సమాజంలో పాపులారిటీ ఉన్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టి తన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించారు. వారిలో సీఏఏ వ్యతిరేక అల్లర్ల కేసు నిందితుడు షిఫా ఉర్ రెహమాన్‌ను ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ఓఖ్లా నియోజకవర్గం నుంచి బరిలోకి దించారు. పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరిగిన షహీన్‌బాగ్ ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. ఇక్కడ ముస్లిం జనాభా పెద్ద సంఖ్యలో నివసిస్తోంది. మరోవైపు నార్త్ ఈస్ట్ ఢిల్లీలో ముస్తాఫాబాద్ నుంచి ఆప్ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌కు ఎంఐఎం టికెట్ ఇచ్చింది. ఢిల్లీ అల్లర్ల కేసులో తాహిర్ హుస్సేన్ నిందితుడు. ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో జైల్లో ఉన్న ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వీలుకల్పిస్తూ.. కోర్టు 12 గంటల కస్టడీ పేరోల్ మంజూరుచేసింది. జైల్లో ఉన్న షిఫా ఉర్ రెహమాన్ తరఫున ఆయన భార్య నూరీన్ ఫాతిమా ప్రచారం చేస్తుండగా.. తాహిర్ హుస్సేన్ తరఫున షమా అంజుమ్ కూడా ప్రచారం చేస్తోంది.తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అసదుద్దీన్ ఓవైసీ కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తన సహజశైలిలో రెచ్చగొట్టే ప్రసంగాలతో ముస్లిం ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. జైల్లో ఉన్న నేతల తరఫున ఆడవాళ్లు చేస్తున్న ప్రచారం సెంటిమెంటును రాజేస్తోంది. మొత్తంగా ఈ రెండు ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ ప్రచారంలో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో ఈ AIMIM పోటీలో ఉన్నచోట ఆ పార్టీకి, లేనిచోట ఆమ్ ఆద్మీ పార్టీకి అన్న చందంగా ముస్లిం ఓటర్ల మనోగతం మారిందని కొందరు రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.ఇదిలా ఉంటే ఢిల్లీలో గెలుపు ఎలాగూ సాధ్యం కాదని గ్రహించిందో.. మరే కారణమో.. కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో జోరు తగ్గించింది. తద్వారా ఎన్నికల్లో ముక్కోణపు పోటీ పరిస్థితిని నివారించి బీజేపీ విజయావకాశాలను దెబ్బతీయాలని చూస్తున్నట్టుగా అర్థమవుతోంది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతు ప్రకటించిన సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అర్వింద్ కేజ్రీవాల్‌తో కలిసి జనవరి 30న ఢిల్లీలో ఉమ్మడి రోడ్‌షో నిర్వహించనున్నారు రితాల నియోజకవర్గంలో వారి రోడ్ షో జరుగుతుందని తెలుస్తోంది. ఎస్పీకి చెందిన పలువురు ఎంపీలు కూడా ఆప్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ శతృఘ్న సిన్హా ఢిల్లీలో ఆప్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జనవరి 31న శతృఘ్న సిన్హా ప్రచారం చేస్తారని ఆప్ వర్గాలు తెలిపాయి ఢిల్లీ అసెంబ్లీని 70 స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో ఎన్నికల నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2020 ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం 70 స్థానాల్లో 62లో ఆప్ గెలుపొందగా.. 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది.

# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచన

- హకీంపేటలో తెలంగాణ క్రీడా పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్
- పాఠశాలలో రాకెట్ క్రీడలను ప్రవేశ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ గౌతమ్





**జయభేరి, జనవరి 29:**

విద్యార్థులు చదువుల్లో ముందుండి అదే విధంగా క్రీడల పై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. బుధవారం హకీంపేట్ లోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలను జిల్లా కలెక్టరు గౌతం సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ క్రీడా పాఠశాలలో రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని పాఠశాల ప్రత్యేక అధికారికి సూచించారు. టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి రాకెట్ క్రీడలను క్రీడా పాఠశాలలో ప్రవేశ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ కు కలెక్టరు సూచించారు. స్కూలులో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యతోపాటు క్రీడలను ఏవిధంగా నేర్పిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల తరగతి గదులు, క్రీడల ప్రాక్టీస్ హాలులను, గ్రౌండ్స్, డైనింగ్ హాల్, కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెనూ చార్టును పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులను భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. క్రీడల ప్రాక్టీస్ హాల్ లో పరికరాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసకున్నారు. ఓపెన్ గ్రౌండ్స్ లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో 4వతరగతి నుండి 12వ తరగతి వరకు 430 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి సంవత్సరం 40 మంది విద్యార్థులను అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందని క్రీడా పాఠశాల ప్రత్యేక అధికారి సుధాకర్ రావు కలెక్టరుకు వివరించారు. ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, ఉదయం సాయంత్రం క్రీడల ప్రాక్టీసు ఉంటుందని తెలిపారు. మెడికల్ రూంలో మెడికల్ ఆఫీసర్, మెడిసిన్, ఫిజియోథెరపి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గోనె హన్మంత్ రెడ్డి నియామకం

- పదవి అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన హన్మంత్ రెడ్డి

**జయభేరి, జనవరి 29:**

ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గోనె హన్మంత్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు ట్రస్మా రాష్ట్ర కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ బాడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నర్సిరెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గోనే హన్మంత్ రెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించడం పట్ల రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా అందరికి అందుబాటులో ఉంటూ సమస్యలపై పోరాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె. అనీల్ కుమార్, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రామచందర్, కో ఆర్డినేటర్ రాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కే. రామేశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సోమశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ డెస్క్ లు అందజేసిన రాణే బ్రేక్ కంపెనీ



**జయభేరి, వర్గల్, జనవరి 29 :**

రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత లో భాగంగా చాంద్ ఖాన్ మక్తా గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ నందు సుమారు 60 వేలు విలువ చేసే 10 స్కూల్ డెస్క్ లను అందజేశారు, ఈ కార్యక్రమంలో కంపెనీ ప్లాంట్ హెడ్ రాజేందర్ మాట్లాడుతూ పిల్లలకు బాల్యంలో మంచి విద్యా బుద్ధులు చెప్పినట్లయితే వారు జీవితంలో మంచి ఉన్నత స్థితులలో ఎదిగి దేశ పురోభివృద్ధికి తోడ్పడుతారని అలాగే వారు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాలలో రాణిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ వీర్ భద్రయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలంటే విద్యా బుద్దులు నేర్పించే ఉపాధ్యాయుల యొక్క సేవలు వెలకట్టలేనివి అని తెలియజేసారు. ఈ కార్యక్రమని ఉద్దేశించి మాజీ ఎంపిటిసి భిక్షపతి రెడ్డి మాట్లాడుతూ కంపనీ చేసినటువంటి ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయం అని తెలిపినారు, అలాగే స్కూల్ హెడ్ మాస్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ కంపెనీ ద్వారా మరిన్ని అభివృద్ధి సేవా కార్యక్రమాల చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది సురేందర్ రెడ్డి , వేణుకుమార్ , దామోదర్, బ్రహ్మానందం, శాస్త్రి , వేణుగోపాల్ , స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, స్కూల్ స్టాఫ్ సుమన్ మేడం మరియు ఇతరులు పాల్గొనడం జరిగినది




## జిల్లా ఉత్తమ బ్యాంక్ మేనేజర్ పున్న సంతోష్ కు సత్కారం

**జయభేరి, దేవరకొండ :**

రైతులకు, వ్యాపారస్తులకు, ఖాతాదారులకు విశిష్ట సేవలు అందిస్తూ గణతంత్ర దినోత్సవం రోజు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ మేనేజర్ గా అవార్డు పొందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరకొండ బ్రాంచ్ మేనేజర్ పున్న సంతోష్ దేవరకొండ గీత సత్సంగ సమితి అధ్యక్షులు నీలా పాండవయ్య,శ్రీ గరుడాద్రి వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఉపాధ్యక్షులు, మార్కెట్ యార్డ్ శివాలయం కార్యదర్శి ఇమ్మడి భద్రయ్య బుధవారం శాలువలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే కాక, వారికి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించే దిశగా అహర్నిశలు కృషి చేస్తూ బ్యాంకును అత్యున్నత స్థానానికి తీసుకువెళ్లాలని కోరారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ఈ పురస్కారం తో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

## రేగూరి ని పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**జయభేరి, పరకాల, జనవరి 29:**

పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి తండ్రి రేగూరి వెంకట్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం మరణించగా నేడు వారి చిత్రపటానికి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించిన బిఅర్ఎస్ రాష్ట్ర నాయకులు రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్. పరామర్శించిన వారిలో మాజీ కౌన్సిలర్లు, స్వేరో నాయకులు, బిఅర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.


## డిజిటల్ ట్రేడింగ్ మోసాలకు పాల్పడుతున్నముఠాను అరెస్టు

**జయభేరి, హైదరాబాద్, జనవరి 29:**

డిజిటల్ ట్రేడింగ్ మోసాలకు పాల్పడుతున్నముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి భారీగా చెక్ బుక్ లు, సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సివి ఆనంద్ మీడియాతో మాట్లాడారు. ఈ డిజిటల్ గ్రూప్ లో మోసాలకు పాల్పడుతున్న వారిలో వివిధ బ్యాంకుల కు సంబంధించిన అధికారుల ప్రమేయం ప్రత్యక్షంగా ఉన్నట్లు తమ విచారణలో తేలిందని సివి ఆనంద్ తెలిపారు. ఒక కేసులో 93 లక్షల ట్రేడింగ్ స్కాం జరిగిందని..ఇది ఇండియాతో పాటు నేపాల్, చైనా సహా మూడు ప్రాంతాల్లో విస్తరించిందని చెప్పారు. బ్యాంకు మేనేజర్ తో పాటు 52 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రబ్బర్ స్టాంపులు, డెబిట్, క్రెడిట్ కార్డులను ముఠా నుండి పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## ఎస్సెస్సీ పరీక్షల్లో సీజీపీఏ కొనసాగించాలి

- యోగితారాణాను కలిసిన ట్రస్మా



**జయభేరి, హైదరాబాద్, జనవరి 29:**


తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, మరియు రాష్ట్ర సలహాదారులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణిని కలిసి ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలలో సీజీపీఏ విధానాన్ని కొనసాగించేందుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పల్లె వినయ్ కుమార్, మెడిచర్ల డైరెక్ట్ అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి గుల్షన్, హైదరాబాద్ కార్యదర్శి రఘు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో నాయకులు CGPA విధానం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. మార్కుల ఆధారిత విధానం అమలులోకి వస్తే, విద్యార్థుల్లో తీవ్రమైన పోటీ, ఆందోళన, ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

CGPA విధానం ముఖ్యమైన ప్రయోజనాలు:

1. ఒత్తిడి రహిత విద్య: CGPA విధానం విద్యార్థులను అవగాహన ఆధారిత అభ్యాసం పట్ల దృష్టిపెట్టేలా చేస్తుంది, మార్కుల కోసం పరుగు తీసే విధానాన్ని తగ్గిస్తుంది.
2. సమగ్ర మూల్యాంకనం: విద్యార్థులను ప్రాజెక్టులు, అసైన్‌మెంట్లు, తరగతి నిర్వహణలో పాల్గొనడం వంటి అనేక అంశాలపై అంచనా వేయడం వల్ల సమగ్ర అభివృద్ధి సాధ్యం.
3. అన్ని విద్యార్థులకు అనువైన విధానం: ప్రత్యేకించి సగటు మరియు తక్కువ మార్కులు పొందే విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ, ఉత్తమ ఫలితాలను సాధించేందుకు మార్గదర్శకం అందిస్తుంది. CGPA విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి TRSMA నాయకత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం మరియు విద్యా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని CGPA విధానాన్ని కొనసాగించాలని అధికారులను మేము కోరుతున్నాము. TRSMA విద్యా వ్యవస్థను మరింత విద్యార్థిస్నేహపూర్వకంగా మార్చేందుకు, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉంది.



Note : అదేవిధముగా పరీక్షలు వ్రాసే జవాబు పత్రాలను తెల్ల పేపర్ కాకుండా cbse, icse పరీక్షలలో ఉపగించే మాదిరిగా సింగల్ (రూల్ )లైన పేపర్ ని ఉపయోగించవాళ్లచిందిగా ట్రస్మా రాష్ట్ర సలహాదారులు కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన శ్రీకాంత్ రావు

**జయభేరి, గజ్వేల్, జనవరి 29 :**

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను బుధవారం టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు గాంధీభవన్ లో కలిశారు. ఈ సందర్భంగా బండారు శ్రీకాంత్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, వివిధ వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కొన్ని సూచనలు అందజేసినట్లు వివరించారు. త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పర్యటించి ప్రజలతో నేరుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ సంక్షేమ పథకాలపై వివరించనున్నట్లు తెలిపారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లో వీలీనం చెయ్యాలి

- స్టీల్ ప్లాంట్కు సొంత ఘనులు కేటాయించాలి -సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం డిమాండ్.




**జయభేరి, పరవాడ:**

నెల్లూరులో ఫిబ్రవరి 1నుంచి 3వ తేదీ వరకు జరుగు సిపిఎం పార్టీ రాష్ట్ర మహాసభల సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ని పరిరక్షించాలని, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లో వీలీనంచేసి సొంత గనులు కేటాయించాలని కోరుతూ సీపీఎం జీపుజాత స్టీల్ ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు సాగుతుంది అని అన్నారు. దీనిలో భాగంగా పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ వద్ద జాతాకి సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరుగు సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శులకు సభ్యులు కే లోకనాథ్ మాట్లాడుతూ విశాఖ స్టిల్ ప్లాంట్ కు ప్యాకేజీ కాదు ప్రయివేటు కరణ చేయనని స్పష్టమైన ప్రకటన చేయాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్యాకేజీ కింద 11,400 కోట్ల రూపాయలు ఇచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ని ఆదానినీకి అమ్మాలని చూస్తున్నారని మండిపడ్డారు. లేదంటే స్మైయిల్స్ లో వీలీనం చేయడానికి ఏంటి అభ్యంతరమని ప్రశ్నించారు. స్మైల్ అథార్టీ వారు వీలీనం చేయడానికి ఒప్పుకోలేదని కాకమ కథలు చెబుతున్నారని అది ప్రభుత్వం రంగ సంస్థ ఇది ప్రభుత్వ రంగ సంస్థ దీనికి అభ్యంతరం ఏముందన్నారు. స్టీల్ ఆదారిటి ఆఫ్ ఇండియాలో వీలీనం చేస్తే 40 వేల ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంతం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అటువంటి చర్యలు చేపట్టకుండా ప్రయివేటి కరణ చేయాలని దూరదృష్టితోనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 1 2 3 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం గత ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు నిర్మించడానికి కార్యక్రమాలు రూపొందింస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు ఎం రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కర్ణం వెంకట్రావు, డి దేముడు, శ్రీను, రాము, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

- ఎమ్మెల్యే కేఅర్ నాగరాజు
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కి సంతాపం తెల్పిన సభ
- మేయర్ ప్రవేశ పెట్టిన పలు బిల్లులలు సభ ఆమోదం



**జయభేరి, హన్మకొండ, జనవరి 29:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హల్ లో మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, లతో కలిసి పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. తొలుత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి సంతాపం తెలిపారు. అనంతరం సర్వసభ సమావేశంలో మేయర్ ప్రవేశపెట్టిన పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. 13 డివిజన్ల పరిధిలోని విలీన గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ నాయకులకు విరామం తప్ప విరమణ ఉండదు

- గుండ్లపొచంపల్లి పురపాలక సంఘం పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

రాజకీయ నాయకులకు ప్రజాక్షేత్రంలో విరామం తప్ప విరమణ ఉండదాని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం గుండ్లపొచంపల్లి పురపాలక సంఘం పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే చమకూర మల్లారెడ్డితో కలసి ఎంపీ ఈటల పాల్గొని చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ రాజకీయ నాయకులకు విరమణ ఉండదని, నిరంతరం ప్రజలమధ్య ఉండటమే నాయకుల బాధ్యత అన్నారు. ఐదు సంవత్సరాలుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన ఛైర్మన్ లక్ష్మీ శ్రీనివాస రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధిగా గెలవడం అదృష్టం అని, అది కూడా తక్కువ ఓట్లు ఉన్న దగ్గర గెలవడం కష్టం అన్నారు. గ్రామాల్లో సర్పంచ్ లు, ఇక్కడ కౌన్సిలర్లకు చాలా కష్టమైన పోటీ ఉంటుందని అలాంటి గుండ్లపోచంపల్లి రిచెస్ట్ ఏరియా న్యూలీ ఎక్సపాండ్ సిటీకి సేవ చేసే భాగ్యం మీకు కలగడం గొప్ప అదృష్టం అని ఈటల పేర్కొన్నారు. మున్సిపాలిటీలో ఇప్పుడు ఉన్న నిధులు ఖర్చు చేయడంలో మీ సలహాలు సూచనలు తీసుకుంటాన్నారు. ఎంపీగా మీ రుణం తీర్చుకుంటా అని నేను ధర్మం, ప్రజలను నమ్ముకున్న వాణ్ణి ఈ పదవి కొనుక్కుంటే వచ్చింది కాదన్నారు. నా భాధ్యత సమున్నతంగా నెరవేర్చడానికి ప్రయత్నం చేస్తా అన్నారు. నిన్ననే రైల్వే అధికారులతో మీటింగ్ ఏర్పటు చేశామని ఈ ప్రాంతంలో 500 600 కోట్లు ఖర్చు చేయబోతున్నాం అని ఆర్.ఓ.బి, ఆర్.యు.బి అన్నీ పూర్తి చేస్తాం అన్నారు. ఏళ్ళ తరబడి పెండింగ్ లో ఉన్న పనులు అన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాలు ప్రజల కోసం ఉండాలి తప్ప వేధించేలా ఉండకూడదని రాజకీయాలలో సముచితంగా ఉండేవాడు, అలుగుడు గులుగుడు ఉంటే వాడు స్వార్థపరులు బాగుపడరు అని గుర్తుపెట్టుకోండని ఈటల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఛైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, బీజేపీ నాయకులు విక్రం రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా సేవలో సంతృప్తి

- కౌన్సిలర్ భేరి బాలరాజు



**జయభేరి, మేడ్చల్ :**

ఐదు సంవత్సరాల కౌన్సిలర్ బాధ్యత ప్రజా సేవలో ఎంతో సంతృప్తి లభించిందని గుండ్లపోచంపల్లి ఐదవ వార్డు కౌన్సిలర్ భేరి బాలరాజు అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పదవి విరమణ కార్యక్రమంలో అధికారులు ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ భేరి బాలరాజు మాట్లాడుతూ మొట్టమొదటిగా ఏర్పడిన గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పాలకవర్గంలో 5వ వార్డు కౌన్సిలర్ గా తనకు మద్దతుగా ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. నా ఐదు సంవత్సరాల పదవి కాలంలో నాకు తెలియకుండా ఎవరికైనా ప్రత్యేక్షంగా కానీ పరోక్షంగా ఇబ్బంది కల్గించి ఉంటే క్షమించాలని భేరి బాలరాజు కోరారు. పదవి ఉన్న లేకున్నా ప్రజలకు మద్దతుగా ఉంటానని అన్నారు. రాజకీయాల్లో వీడ్కోలు అనేది పదవికే కానీ సేవకు కాదన్నారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుండే నాయకులకు ప్రజల గుండెల్లో పదవి ఎప్పుడు ఉంటుందని తెలిపారు. 5వ వార్డు అభివృద్ధికి కృషి చేసిన ఛైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రభాకర్, అధికారులు, తోటి కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మున్సిపల్ విధులను ప్రతి అధికారి పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**జయభేరి, రాజన్న సిరిసిల్ల జిల్లా :**

సిరిసిల్ల పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలి. 100% ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేయాలి. నూతన భవన నిర్మాణాల అనుమతులు, నూతన లేఔట్ అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయాలి. సిబ్బంది అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయవద్దు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. సిరిసిల్ల మున్సిపాల్టీల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా మున్సిపాలిటీలలో ప్రతి ఒక్క అధికారి తన విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సిరిసిల్ల మున్సిపాల్టీల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్సిపాలిటీ లలో పని చేస్తున్న సిబ్బంది, అధికారుల వివరాలు, వారు నిర్వహిస్తున్న విధులు, సానిటరీ డోర్ కలెక్షన్, ఎన్ని చెత్త బుట్టలు పంపిణీ చేసారు.

# పార్టీ శ్రేణులకు అండగా బిఆర్ఎస్

- 2లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత
- చెక్కును అందజేస్తున్న మాజి ఎఫ్డీసి వంటేరు ప్రతాప్ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, జనవరి 29 :**

బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పూర్తి అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని మాజీ ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు.గత కొన్ని రోజుల క్రితం కొండపాక మండలంలోని గిరాయిపల్లి గ్రామానికి చెందిన మైలారం సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు పొలంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందారు.మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సహకారంతో బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా 2 లక్షల చెక్కును మృతుని భార్య రాజేశ్వరి కి అందజేసిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రజల పార్టీ అని ,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని నీల యాదగిరి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మరణించగా వారి కుటుంబానికి రెండు లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేయడం జరిగిందని అన్నారు, ఒక్క గజ్వేల్ నియోజకవర్గం లోనే దాదాపు 97,500 సభ్యత్వాలు కలిగి ఉన్న పార్టీ అన్నారు. దాదాపు ఇప్పటివరకు 381 మృతుల కుటుంబ సభ్యులకు 7 కోట్ల 62 లక్షల రూపాయలు టిఆర్ఎస్ ప్రమాద బీమా నుండి అందించడం జరిగిందన్నారు.కెసిఆర్ టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కోసం ప్రమాద బీమా లాంటి సౌకర్యాన్ని కల్పించారన్నారు, భారతదేశంలోని ఏ పార్టీ కూడా కార్యకర్తల కోసం ఇలాంటి సౌకర్యాన్ని కల్పించలేదన్నారు, కార్యకర్తను కంటికి రెప్పల టిఆర్ఎస్ కాపాడుకుంటుందని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు, కార్యకర్తల కోసం ఏ ఆపద వచ్చిన తాము అందుబాటులో ఉంటామని వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు, రాబోయే ఎన్నికలలో అధికారం మనదే అని ముఖ్యమంత్రి కేసీఆర్ అవుతారని వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు.26 జనవరి కి నాలుగు పథకాలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పరన్నారు కేవలం మండలంలోని ఒకే గ్రామానికి పూర్తిస్థాయిలో కాకుండా కొంతమందికి మాత్రమే ఇవ్వడం చాలా దారుణం అన్నారు,మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటని వంటేరు ప్రతాపరెడ్డి ప్రశ్నించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన పాఠం చెప్తారని వంటెరూ ప్రతాప్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు, కాంగ్రెస్ పథకాల అమలుకు నిరంతరం ప్రశ్నిస్తూ ఉండాలని కాంగ్రెస్ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలను పిలుపునిచ్చారు, అబద్ధాలు చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ హామీల అమలులో విఫలమై రోజుకు ఒక డ్రామా తో రాజకీయ లబ్ధి పొందుతుందని వంటేరు ప్రతాపరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు తెలంగాణ రాష్ట్రంలో అసమర్థ దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యమేలుతుందని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వలన ప్రజలు విసుగు చెందారని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో ఓట్లను దండుకోవడానికి మాత్రమే గ్రామసభలు ఏర్పాటు చేశారని ఏర్పాటు చేసిన గ్రామసభలలో రేషన్ కార్డులు ఇందిర ఇండ్లు ఇంద్రం ఆత్మీయ భరోసా కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాత్రమే రాసుకోవడం చాలా దుర్మార్గమని తెలిపారు, సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. పంచుకుంటున్నారన్నారు. పేద ప్రజలను అర్హులైన వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు, స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి అనంతుల ప్రశాంత్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, గిరాయిపల్లి సర్పంచ్ సంజీవ రెడ్డి, నాయకులు అహ్మద్, జిల మల్లేశం, చంద్రమౌళి, ప్రభాకర్ తదితరులున్నారు.

# అరుదైన జబ్బుకు మెరుగైన చికిత్స

- మలక్పేట్ యశోద హాస్పిటల్ లో అకలాసియా కార్డియా అనే అరుదైన జబ్బుకు మెరుగైన చికిత్స
- అత్యంత తీవ్రతరం వ్యాధులను పరిష్కరిస్తున్న యశోద మలక్పేట్ హాస్పిటల్ వైద్య బృందం
- అకలాసియా కార్డియా అనే అరుదైన వ్యాధికి ఎండోస్కోపీ చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన యశోద వైద్య బృందం




**జయభేరి, దేవరకొండ :**

హైదరాబాద్ మలక్పేట్ యశోద హాసిటల్లో ఆకలాసియా కార్డియా అనే అరుదైన వ్యాధికి ఎండోస్కోపీ విధానంతో ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రముఖ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటీరాలజిస్ట్ డాక్టర్ కిషన్ నున్సవత్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం దేవరకొండ పట్టణం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకలాసియా కార్డియా అనే ఓ అరుదైన వ్యాధి ప్రతి పది వేల మందిలో ఒకరికి వచ్చే అవకాశం ఉంటుందని, ఈ వ్యాధి సోకిన రోగి నోటి ద్వారా ఆహారాన్ని తీసుకోలేకపోవడం ఈ వ్యాధి లక్షణం అని అన్నారు. గతంలో ఈ వ్యాధికి శస్త్ర చికిత్స మాత్రమే పరిష్కారం ఉండేదని, కానీ యశోద మలక్పేట హాస్పిటల్లో అత్యంత అధునాతన వైద్య రీతిలో దీనికి మెరుగైన చికిత్సను అందించి 44 సంవత్సరాల వ్యక్తి ప్రాణాలు కాపాడమని తెలిపారు. శిరసనగండ్ల గ్రామానికి చెందిన రంగారెడ్డి అనే వ్యక్తి గత పది సంవత్సరాల నుండి ఆహార పదార్థాలను మింగడానికి చాలా ఇబ్బంది పడుతుండేవాడని, గత ఆరు నెలలుగా అతను ద్రవపదార్థాలను కూడా తీసుకోలేకపోతున్నాడని తెలిసి అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో అతనికి మలక్పేట యశోద ఆసుపత్రి తీసుకొచ్చారు. పరీక్షలు జరిపిన తర్వాత అతనికి ఉన్న జబ్బు అకలాసీయ కార్డియా టైప్ వన్ అని నిర్ధారించామని తెలిపారు. కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఇంటిరాలజిస్ట్ డాక్టర్ కిషన్ నున్సవత్ ఎండోస్కోపీ చికిత్స ద్వారా అతని వ్యాధి నయం చేశామని తెలిపారు. ప్రస్తుతం అతను నోటి ద్వారా ఆహారం తీసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది పడటం లేదని తెలిపారు. యశోద మలక్పేట ఆసుపత్రిలో అత్యంత అధునాతన సౌకర్యాలు సాంకేతిక వైద్య పరిజ్ఞానం చికిత్స పద్ధతులతో కూడిన గ్యాస్ట్రో ఎన్టీరాలజీ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. అత్యంత క్లిష్టమైన వ్యాధులను కూడా యశోద వైద్య బృందం చక్కటి చికిత్సను పరిష్కారాలను అందజేస్తుందని వారు భరోసానిచ్చారు.

# ఆర్ఎస్ఎస్ విషపు కోరల్లో యుజిసి

- రాష్ట్రాల హక్కులను హరిస్తున్న యూజీసీ ముసాయిదాను రద్దు చేయాలి
- యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడుకుందాం



**జయభేరి, పరకాల, జనవరి 29:**

బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో యుజిసి తీసుకొచ్చినటువంటి నూతన ముసాయిదా మార్గదర్శకాలకు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయంను కాపాడుకుందాం అనే కరపత్రాన్ని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అలాగే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్ శ్రీకాంత్ లు విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ విద్యాలయాలు కళాశాలలలో ఉపాధ్యాయులు అకాడమిక్ సిబ్బంది నియామకాలు ప్రమోషన్స్ కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాలు, నిర్వహణ పేరుతో యుజిసి ముసాయిదా మార్గదర్శకత్వం జనవరి 6న డ్రాఫ్ట్ విడుదల చేశారు. అయితే భారతదేశవం ఉన్నత విద్యారంగంలో ప్రమాదకరమైనదిగా ఈ ప్రతిపాదనలు ఉన్నాయి. ఆర్ఎస్ఎస్ హిందుత్వ భావజాలం గల వ్యక్తులను విశ్వవిద్యాలయ కేంద్రాలుగా ప్రొఫెసర్లు వైస్ ఛాన్సలర్లు గా నియమించే విధంగా విద్యను వికేంద్రీకరణ కార్పొరేటీకరణ చేసే దిశగా బిజెపి పూనుకుంది. నూతన విద్యా విధానం 2020లో భాగంగానే ఈ ముసాయిదా తీసుకువచ్చారని ఇది విద్యారంగంపై రాష్ట్రాలకు ఉన్న అధికారాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యాంగ మౌలిక సూత్రమైన ఫెడరలిజానికే ముప్పు తెచ్చే విధంగా ఉందని విమర్శించారు. ఈ ముసాయిదాతో స్వయం ప్రతిపత్తిగా అధ్యయన కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు ఆర్ఎస్ఎస్ భావజాల వ్యాప్తి క్యాంపులుగా గా మారుతాయని అన్నారు. ఉన్నత విద్యలో ఇంతటి విష భవాజాలాన్ని నింపే యు జి సి ముసాయిదాను విద్యార్థులు మేధావులు ప్రజాస్వామ్యవాదులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, యూనివర్సిటీ అధ్యక్షులు సాయి కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు అరుణ్, అఖిల్, మంగిలాల్, సాయి అలాగే యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ పంపులో కల్తీ డీజిల్ కలకం



**జయభేరి, వికారాబాద్:**

పెట్రోల్ డీజిల్ బంక్ లలో కల్తీలకు పాల్పడుతుండటంతో తమ వాహనాలు చెడిపోతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా పరిగి కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్లో డీజిల్ లో కల్తీ జరిగిందని వినియోగదారులు ఆందోళనకు దిగారు. డీజిల్ లో కల్తీ జరిగింది అంటూ వినియోగదారులు పెట్రోల్ బంక్ సిబ్బందిని నిలదీశారు. పంపులో పని చేస్తున్న వ్యక్తులు ఒక్కో పంపులో ఒక్కో రకంగా డీజిల్ ఉంటుందని అన్నారు. మీకు కావాలంటే డెన్సిటీ చూపిస్తాం, డిజిల్ లో మీటర్ పెట్టి చూపించడం జరిగింది. డీజిల్ డబ్బులో నురగలు రావడం డబ్బా కింది భాగం వాటర్ కనిపించడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు వేల రూపాయలు ఇచ్చి జెసిబిలు, ట్రాక్టర్లు లారీలు, కార్లలో డీజిల్ వేయిస్తున్నాం. పంపులలో కల్తీ డీజిల్ విక్రయిస్తే ఆలస్యంగా వాహనాలు రిపేర్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తొందరగా రిపేర్ కు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్ ,డీజిల్ లో కల్తీలకు పాల్పడే పెట్రోల్ బంక్ లపై చట్టరీత్యా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పెట్రోల్ డీజిల్ వినియోగదారులు డిమాండ్ చేశారు. డీజిల్ను డెన్సిటీ చేసి చూపించిన పంపులో పనిచేసిన వ్యక్తులు టెస్ట్ పేపర్ పై టెస్ట్ చేసి చూపకపోవడం పట్ల పెట్రోల్ డీజిల్ వినియోగదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ లో డీజిల్ లో మరి టెస్ట్ పేపర్ పై ఎందుకు టెస్టు చేయలేదని వినియోగదారులు నిలదీస్తున్నారు.

పెట్రోల్ డీజిల్ వినియోగదారులకు డెన్సిటీ పట్ల పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం సిబ్బంది ఎంత చెబితే అంతకి ఒప్పుకోవడం అనేది వినియోగదారులకు అర్థమయ్యే విషయం. కానీ ఇక్కడ టెస్ట్ పేపర్ పై డీజిల్ గాని పెట్రోల్ గాని ఒక చుక్క వేస్తే మొత్తం విస్తరిస్తుంది . ఏమాత్రం కల్తీ ఉన్నా వెంబడి టెస్ట్ పేపర్ పై మచ్చల రూపకంగా వినియోగదారులకు కనబడుతుంది. కనుకనే టెస్ట్ పేపర్ పై టెస్ట్ చేయకుండా అక్కడ సిబ్బంది తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. అధికారులు కల్తీలకు పాల్పడుతున్న పెట్రోల్ పంపు లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.




## నిన్నూ.. సితారను చూడాలి.. గౌతమ్ తో గేమ్స్ ఆడాలి

**జయభేరి, హైదరాబాద్, జనవరి 29:**

రాజమౌళి మూవీ అంటే అందరిలోనూ ఆసక్తి ఉంటుంది. ఆయన సినిమా అంటే ఏళ్ల తరబడి షూటింగ్ జరగాల్సిందే. నటీనటులు దగ్గర నుంచి సాంకేతిక సిబ్బంది వరకూ లాక్ అయిపోయినట్లే. ఎందుకంటే జక్కన్న మూవీ అంటే అంతే మరి. కొన్ని సంవత్సరాల తరబడి షూటింగ్ చేసే రాజమౌళి సినిమా వచ్చిందంటే బాక్సాఫీస్ బద్దలు కావాల్సిందే. బాహుబలి రెండు పార్ట్ లు కానీ, తర్వాత RRR మూవీ కానీ ఏళ్ల తరబడి షూటింగ్ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయినా సరే రికార్డులన్నీ బ్రేక్ చేసేశాయి. RRR మూవీలో పాట కూడా ఆస్కార్ అవార్డు కొట్టేసింది. అలా ఉంటది జక్కన్నతో మరి. అందుకే వెరీ వెరీ స్పెషల్ జక్కన్న సినిమాకు ముందు నుంచే ప్రమోషన్స్ ప్లాన్ చేయడంలో ఆయనను మించిన వారు మరొకరు ఉండరు.తన సినిమాకు తాను హైప్ సృష్టించుకోవడంలో విన్నూత్నంగా జనంలోకి వెళ్లడంలో రాజమౌళి తర్వాతే ఎవరైనా. రాజమౌళి దర్శకత్వం వహించిన ఒక్క సినిమాలోనైనా నటించాలని చాలా మంది అగ్రహీరోలు కూడా కోరుకుంటారంటే ఇదే కారణం. ఇక తాజాగా రాజమౌళి సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్ లో మూవీ షూటింగ్ ప్రారంభమయింది. షూటింగ్ ప్రారంభమయినట్లు అఫిషియల్ న్యూస్ వచ్చేసింది. మహేష్ బాబు పాస్ పోర్టును స్వాధీనం చేసుకున్నట్లు వీడియో షేర్ చేయడంతో ఇక ఫ్యాన్స్ కు పూనకాలు వచ్చేశాయి. బోనులో సింహాన్ని బంధించినట్లు వచ్చిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇక దీనపై నెట్టింట్ మీమ్స్ కూడా వస్తున్నాయి. పాపం పసివాడు సినిమాలో పాటను మహేష్ బాబుకు మార్చి పాడుతూ నమ్రత్రా చూడాలి.. నిన్నూ.. సితారను చూడాలి.. గౌతమ్ తో గేమ్స్ ఆడాలి అంటూ వచ్చిన వీడియో కూడా వైరల్ అయింది. అయితే తాజాగా రాజమౌళి షూటింగ్ లో కొన్ని షరతులను విధించినట్లు చెబుతుంది. ఈ సినిమాలో రాజమౌళి మహేష్ బాబు కాకుండా మరొకరి పేరు బయటకు రాలేదు. ప్రియాంక చోప్రా పేరు బయటకు వచ్చినా అధికారికంగా చిత్ర యూనిట్ ప్రకటించలేదు. అలాగే మలయాళనటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నాడంటూ వార్తలు హల్ చల్ చేసింది. అందులో నిజమెంతో తెలియదు. తాజాగా బాలివుడ్ నటుడు జాన్ అబ్రహాం పేరు కూడా బాగా వినిపిస్తుంది. అయితే ఇవన్నీ ఊహాగానాలే. రాజమౌళి ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతేకాదు ఆయన కొన్ని నెలలు ముందుగానే షూటింగ్ స్పాట్ లను చూసి వచ్చి కెమెరా స్విచ్ ఆన్ చేశారన్న నేపథ్యంలో కొన్ని షరతులు విధించారంటున్నారు. బాలీవుడ్ స్థాయిలో భారీగా ఖర్చు పెట్టి తీస్తున్న సినిమా కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని నెలల పాటు జరిగే షూటింగ్ కు వందల సంఖ్యలో సాంకేతిక సిబ్బంది, నటీనటులు వస్తారు. అయితే వీరెవ్వరూ సెల్ ఫోన్ తేవడానికి వీలులేదని రాజమౌళి షరతు విధించినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చిత్రంలో నటించే వారి పేర్లు కానీ, సాంకేతిక నిపుణుల పేర్లు కానీ బయటకు వెల్లడించకూడదని ఒప్పందం కూడా అందరి చేత రాజమౌళి రాయించుకున్నారని చెబుతున్నారు. హీరో తో పాటు సెట్ లో ఉన్న అందరూ సెల్ ఫోన్లను తేవద్దని, అలా అతిక్రమించిన వారిపై చర్యలుంటాయని కూడా హెచ్చరించారు. సమాచారం ఏమాత్రం బయటకు పొక్కినా సహించేది లేదన్న హెచ్చరికను తొలి రోజు షూటింగ్ లోనే జక్కన్న ఇచ్చారని తెలిసింది. దీంతో ఇప్పుడు మహేష్ బాబు కూడా ఫోన్ తీసుకురాకపోవడంతో నమ్రతా చూడాలి.. నిన్నూ సితారను చూడాలి.. గౌతమ్ తో గేమ్స్ ఆడాలి అన్న పేరడీ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# ఆడవాళ్లు మహాలక్ష్మిలైతే... మరి మగవాళ్ళు..!?

- మీరు చదివింది కరెక్టే మగవాళ్ళ పరిస్థితి
- నేడు ప్రశ్నార్థకంగా మారుతుంది..!
- ఆర్టీసీ బస్సుల్లో అమాయక గొర్రెల్లాగా నిలబడడమే తప్ప కూర్చోవడం మర్చిపోతున్నారు...!
- రాజకీయ నాయకుల వలలో పడుతున్న మహిళలోకం ఉచిత పథకాలకు అలవాటు పడుతున్నారు... పద్ధతిని మరిచిపోతున్నారు...
- తెలంగాణ రాష్ట్రంలో ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణం ఏర్పాటుచేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం సందేశాన్ని అందించారు..!?
- మహాలక్ష్మి లు అని సంబోధిస్తూ వారికి ఉచిత ప్రయాణం అందించడం బాగానే ఉంది, అదే సమయంలో మరి మగవారి గురించి కూడా ఎందుకు ఆలోచించలే..!?
- ఇదే విషయంపై "జయభేరి" సంధిస్తున్న కౌంటర్ విత్ కదారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర వివరణ...





కదారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

ప్రభుత్వాలు మారుతున్న కొద్దీ పథకాలు ఉచిత పథకాలుగా కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఆ ఉచిత పథకం ఇచ్చింది అంటే అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధికారంలోకి వస్తే దానికి మించిన ఉచిత పథకం అందివ్వాలని ఒక దుర్బుద్ధి స్వార్థపూట ఆలోచనలతో పుట్టుకొస్తున్న ఉచిత పథకాలు ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి.. ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రజలకు సేవకులుగా మారాలి తప్ప అధికారులుగా మారిపోయి పెత్తందారులుగా అధికారాన్ని చెలాయిస్తూ ప్రజలకు బిస్కెట్లు విసిరేస్తున్నారు...

ఇక తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రం సాధించుకున్న తొలినాళ్లలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారం చలాయించి 10 సంవత్సరాలు తన నిరంకుశత్వాన్ని చూపించుకున్నాడు. దీన్ని సహించని తెలంగాణ జనం ఏకపక్ష తీర్పు నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం కర్ణాటకలో మహిళలకు ఉచిత ప్రయాణం అందించిన అవకాశం కలిసి వచ్చిందని ఆలోచనతోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా మహిళలకు ఆధార్ కార్డు ద్వారా ఉచిత ప్రయాణాన్ని అందివ్వాలని ఆలోచనను పదును పెట్టి బాగానే సక్సెస్ అయ్యారు. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు సమస్య ఇప్పుడు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. కానీ దీనిపై ఎవరూ మాట్లాడరు? ఆడవాళ్లు ఆర్టీసీ బస్సుల్లో చేసే ప్రయాణంపై ఎవరు నోరు విప్పరు? అదేమంటే మహాలక్ష్మి వాళ్ళను ఒక్క మాట కూడా అనొద్దు అన్న సీఎం రేవంత్ రెడ్డి వారికి ఉచిత ప్రయాణం బాగానే ఇస్తూ భర్త గొడవ పెట్టుకున్న అత్త తిట్టిన చేతిలో డబ్బులు లేకపోయినా ఎంచక్కా ఆర్టీసీ బస్సు మీకు ఉచిత ప్రయాణాన్ని అందిస్తుంది అన్న వాగ్దానం ఇప్పుడు తెలంగాణ మహిళల్లో స్పష్టంగా కనిపిస్తోంది.. పని ఉన్న లేకపోయినా పుణ్యక్షేత్రాలు తిరగాలన్న పెళ్లి పేరంటాల కెళ్ళాలి అన్న ఏం తోచకుంటే అలా హైదరాబాదుకు పోయొద్దామన్న ఆలోచనలతో నేటి మహిళ లోకం నిద్రలేచి ఆర్టీసీ బస్సు ఎక్కి తమ పెత్తనని చెలాయిస్తున్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే రూట్లలో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీకి లాభదాయకంగానే ఉన్న పురుషులకు మాత్రం నరకం కనిపిస్తోంది..

ఆర్టీసీ బస్సుల్లో గతంలో ఆడవారి సీట్లలో వారిని కూర్చోనిద్దాం వారిని గౌరవించడం మన సాంప్రదాయం అంటూ పెద్ద పెద్ద కొటేషన్లు అందించిన మన ప్రభుత్వ పెద్దలు... నేడు అధికారంలో ఉన్న ఈ ప్రభుత్వ పెద్దలు మగవారి సీట్లలో మగవారినే కూర్చోనిద్దాం అని రాస్తే బాగుంటుందని పురుషలోకం గోషిస్తుంది... ఆడవాళ్లు మహాలక్ష్మిలైతే మేము రాక్షసులమా మాకు మానం అభిమానం ఉండవా అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.. ఏ బస్సులో చూసిన పల్లెల్లో పట్నాలలో నగరాల్లో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఒకప్పుడు ముందు నుంచి ఎక్కేవారు.. కానీ నేడు పరిస్థితులు మారాయి కాలం మారింది ప్రభుత్వాలు మారాయి అధికారం ఆడవాళ్లకు వచ్చినట్లు అయింది.. అందుకే వెనకాలేదు ముందు లేదు బస్సు మొత్తం మాదే అన్నట్టుగా వాళ్లు బస్సు ఎక్కి విధానం చూస్తే ఒక్కసారి సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ బస్సు ప్రయాణం జనంతో కలిసి చేస్తే అప్పుడు తెలుస్తుంది సీఎం రేవంత్ రెడ్డి పెట్టింది మంచిదా చెడుదా అనేది అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని పురుషలోకం తమ ఆవేదనను వెల్లదిస్తోంది. ఆడవాళ్లకు ఉచిత ప్రయాణం అందించడం మగవారికి ఏ కోశానా సందేహం లేదు.కానీ అదే సమయంలో పురుషుల మానవ అభిమానం కాపాడుకునే పరిస్థితి కూడా పురుషులకు హక్కు లేదా!? ఇక ఎన్నో పత్రికలు మహిళలకు మహాలక్ష్మి లకు అవమానం అంటూ గగ్గోలు పెడుతున్న మరి పురుషుల సంగతిని ఎందుకు పట్టించుకోవట్లేదు మీడియా అన్నది.

మీ మాంస... అదేం లేదు ఆడవాళ్లు మగవాళ్ళు సమానమే అన్ని రంగాల్లో ఆడవాళ్లు ముందుకొస్తున్నారు దీని నుంచి భువి దాకా ఆడవాళ్ళ అవసరం ఎంతైనా ఉంది అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న మహిళ నేతలు మహిళా శిరోమణులు ఒకసారి సాధారణ ఆర్టీసీ బస్సు ప్రయాణం చేయండి పురుషుల బాధ ఎంత ఉందో మీకే అనుభవపూర్వకంగా తెలుస్తుంది. మరి కొంతమంది ఆడవాళ్లకు మాత్రమే అన్న బస్సులను అందించాలి అన్న మాటలు కూడా ఒక్కసారి ఆలోచిస్తూ.. ఉన్న బస్సులకే దిక్కు లేకుండా పోతున్న నేటి తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి ఎలక్ట్రానిక్ బస్సులను తీసుకువచ్చి కొంత మేలే చేసిన రానున్న రోజుల్లో మరిన్ని ఎలక్ట్రానిక్ బస్సులను అందిస్తే కానీ ఈ సమస్య తీరదేమో... ఎందుకంటే సాక్షాత్తు మహిళా కండక్టర్లుగా చేస్తున్న కొంతమంది మహిళలు కూడా తమ తోటి మహిళలు ప్రవర్తించే ప్రవర్తనను వాళ్ళు సమర్థించుకోవడం లేదు. ఆడవాళ్ళైనా మగవాళ్ళైనా సమానమే అంటూనే వారికి కేటాయించిన సీట్లు కూర్చుంటే బాగుంటుంది అంటూ ఒక ఈసడింపు కనిపిస్తోంది...

మొత్తానికి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆధార్ కార్డుతో ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆర్టీసీకి లాభాలే తీసుకొచ్చిన మగవారికి కంఠశోకాన్నే మిగిలిస్తున్నాయి... అందుకే కాబోలు బైకులు బుక్ చేసుకుని కార్లు బుక్ చేసుకుని తమ సొంత పనులను తీర్చుకుంటున్నారు. ఏది ఏమైనా మగవారి పరిస్థితిని కూడా ఈ ప్రభుత్వం ఆలోచించాలి అంటూ తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు.




## ఆమెజాన్ లో ఇంటి దొంగలు..

జయభేరి, హైదరాబాద్, జనవరి 29:

అమెజాన్ కంపెనీ సరకు రవాణాలో వేయని ట్రిప్పులకు చెల్లింపులు జరిపి ఏకంగా రూ.102కోట్లు కొట్టేశారు. హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ మోసంలో సంస్థ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారు. ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ సరకు రవాణా పర్యవేక్షణ హైదరాబాద్ నుంచి జరుగుతుండటంతో కుట్ర పూరితంగా మోసం చేశారు.: పనిచేస్తున్న సంస్థకు ఉద్యోగులు టోకరా వేయడంతో ఈకామర్స్ దిగ్గజం అమెజాన్‌కు భారీ నష్టం వాటిల్లింది. అందులో పనిచేసే ఉద్యోగులే హైదరాబాద్ కేంద్రంగా భారీ మోసానికి పాల్పడ్డారు. నకిలీ ట్రిప్పులతో డెలివరీ చేసే వారికి చెల్లించే కమిషన్ పేరిట భారీగా సొమ్ము చేసుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగాఈ మోసం జరగడంతో పోలీస్ కేసు నమోదు అయ్యింది. అమెజాన్ కాల్ సెంటర్‌లో పనిచేసే ఉద్యో గులు, గతంలో పనిచేసి మానేసిన వారు.. అమెరికాలో సరకులు సరఫరా చేసే వారితో కలిసి ఈ కుట్రకు పాల్పడినట్టు అమెజాన్ సంస్థ ఫిర్యాదు చేసింది. ఈ మోసంతో అమెజాన్‌కు దాదాపు రూ.102 కోట్ల నష్టం వాటిల్లినట్టు సైబర్ సెక్యూ రిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మొదలు పెట్టారు.ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ సంస్థ ఈ కామర్స్ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో సరకుల డెలివరీ వ్యాపారంలో అగ్రస్థానంలో ఉంది. ఈ క్రమంలో కస్టమర్లకు అవసరమైన సాంకేతిక సాయం మొత్తం హైదరాబాద్ నుంచి అందుతుంది.కస్టమర్ అమెజాన్ అప్లికేషన్‌లో కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసిన తర్వాత..దానిని సమీపంలోని షిప్పింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడి నుంచి వినియోగదారుడు ఉన్న ప్రాంతంలోని కేంద్రానికి వెళుతుంది. స్థానిక షిప్పింగ్ సెంటర్ నుంచి వినియోగదారుడి చిరునామాకు ఏజెంట్ల ద్వారా డెలివరీ చేస్తారు. ఇదంతా పూర్తిగా సాంకేతికతతో నడుస్తుంది.కస్టమర్ ఆర్డర్ చేసిన సరకు ఎక్కడుందనే విషయం ఎప్పటికప్పుడు అమెజాన్ కార్యాలయంలో ట్రాక్ అవుతుంది. బార్ కోడ్‌లను స్కాన్ చేయగానే ఈ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలనే స్పష్టత వచ్చేస్తుంది. కస్టమర్‌కు డెలివరీ ఇచ్చే వారి ఫోన్లలో ప్రత్యేక యాప్ ఉంటుంది. డెలివరీ కోసం స్థానిక షిప్పింగ్ సెంటర్ నుంచి వస్తువులను తీసుకున్న తర్వాత చెక్‌ఇన్ చేస్తారు. ఆర్డర్లను వినియోగదారుడికి అందజేసిన తర్వాత చెక్‌వుట్ చేస్తారు. డెలవరీ చేసే వారి జీపీఎస్‌ను ఎప్పటికప్పుడు అమెజాన్ ట్రాక్ చేస్తుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ డెలివరీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. ఇది అమెజాన్ కమ్యూనికేషన్ రిలే కేంద్రంగా వ్యవహరిస్తుంది.సరకు డెలివరీ చేసే ఒక్కో వ్యక్తికి అదే రూట్లో ఉండే ఆర్డర్లను డెలివరీ చేయడానికి వస్తువులను అందిస్తారు. డెలివరీ సాధారణంగా కమిషన్ రూపేణా చెల్లిస్తారు. స్థానికంగా ఏజెన్సీలను నియమించుకుంటారు. డెలివరీ కోసం వెళ్లినపుడు కస్టమర్ స్పందించకపోయినా, అందుబాటులో లేకపోయినా, వివిధ కారణాలతో వస్తువులను తీసుకోడానికి నిరాకరించినా ఆ విషయం యాప్‌లో నమోదు చేస్తారు. దీనిని హైదరాబాద్‌లో కమ్యూనికేషన్ సెంటర్ ధృవీకరించాల్సి ఉంటుంది.కస్టమర్ ఆర్డర్ చేసిన వస్తువులను డెలివరీ చేయడానికి ఎంత దూరం ప్రయాణించారో లెక్కించి అందుకైన ఖర్చును డెలివరీ సంస్థలకు అమెజాన్ చెల్లిస్తుంది. ఇక్కడే ఉద్యోగులు, ఏజెన్సీలు మోసానికి పాల్పడ్డాయి. హైదరాబాద్‌లో రిలే కమ్యూనికేషన్ సెంటర్ ఉద్యోగులను ప్రలోభ పెట్టారు. గతంలో అమెజాన్‌లో పనిచేసి మానేసిన వారు దీనికి సూత్రధారులుగా వ్యవహరించారు. అమెరికాలో సరకుల డెలివరీకి వెళ్లకుండానే వెళ్లినట్లు నకిలీ ట్రిప్పులు నమోదు చేయించడం, ఆ తర్వాత వినియోగదారులు లేరని చెబుతూ వారికి కమిషన్లు చెల్లించారు.ఇలా కొంత కాలంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ల రూపంలో రూ.102.88 కోట్లను స్వాహా చేశారు. అమెజాన్ ఇంటర్నల్ ఆడిట్‌లో పెద్ద ఎత్తున ఇలాంటి లావాదేవీలు గుర్తించి ఆరా తీయడంతో అవన్నీ నకిలీగా తేలింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అమెజాన్ ప్రతినిధి జీఎస్ అర్జున్ కుమార్ ఫిర్యాదు చేశారు.అమెజాన్ ఫిర్యాదు మేరకు మహ్మద్ అబ్దుల్ పహీమ్, కె అనిల్ కుమార్. ఆకాంక్షా పట్నాయక్, అవినాష్ కరి, కునాల్ కౌశిక్ దేవళ్‌లే, మహ్మద్ రిజావుల్లా, ఎండీ షాబాద్ అలీబాన్, ఎండీ. షోయబుద్దీన్, మహ్మద్ ముపాసిల్, షేక్ ఫర్ద్వాన్, దువ్వాడ శివగణేశ్, బుడ్డి శివకుమార్ రాజ్, అబిలాష్, అజయ్ కుమార్, దాశరథి, హృదయ్ కుమార్, కొడారి తులసీరాజ్, పృథ్వీరెడ్డి చింతా రెడ్డి, మహ్మద్ రహేల్, లోహిత్ మద్దాబత్తుల, మహ్మద్ ఆదిల్, సాయికుమార్, కమతం శివభరత్ కృష్ణలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## మల్లన్న మాయం..

జయభేరి, హైదరాబాద్, జనవరి 29:



మాస్ మల్లన్న.. తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సోషల్ మీడియా స్టార్. పబ్లిక్లో భలే క్రేజ్..! ఎక్కడికి వెళ్లినా ఆయనతో సెల్ఫీ దిగడానికి పోటీలు పడే జనం. కొన్ని సందర్భాల్లో మాజీ మంత్రి కేటీ రామారావు సైతం నాకంటే మల్లన్నకే ఎక్కువగా క్రేజ్ ఉందని చెప్పిన సందర్భం. ఆయనే మన మాజీ మంత్రి మల్లారెడ్డి. యూత్‌ను అట్రాక్ట్ చేసే డైలాగ్స్‌తో, ఫ్లీజ్ వాయిస్ తో ఆయనే చెప్పే పంచ్ డైలాగులు సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో తిరుగుతూ ఉంటాయి.ఆయనే రాజకీయాల్లో అంతే చురుగ్గా కనిపిస్తూ ఉంటారు. అసెంబ్లీలో మాట్లాడిన నవ్వులే నవ్వులు. ఆయననే చామకూర మల్లారెడ్డి. మొదటిసారిగా 2014లో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా తెలుగు దేశం పార్టీ తరుపున గెలుపొంది, కొద్ది రోజులకే గులాబీ కండువా కప్పుకున్నారు. 2018 ఎన్నికల్లో మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. వెంటనే కేసీఆర్ కేబినెట్ లో చోటు దక్కించుకున్నారు. మొన్నటి ఎన్నికల్లో కూడా మేడ్చల్ నుంచి మళ్లీ రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు మల్లారెడ్డి.మంత్రిగా ఉన్నప్పుడు హల్చల్ చేసిన మాస్ మల్లన్న గత కొద్ది నెలలుగా మాత్రం చాలా సైలెంట్‌గా కనిపిస్తున్నారు. రాజకీయ ప్రసంగాలు లేవు, పవర్ ఫుల్ డైలాగులు లేవు, అసలు మీడియాలోనే కనిపించకుండాపోయారు. అంత యాక్టివ్‌గా ఉండే మాజీ మంత్రి మల్లారెడ్డి ఎందుకు ఇంత తెరవ వెనక్కి వెళ్లిపోయారని పార్టీలో చర్చ జరుగుతుంది. ఇందుకు కారణం ఆయన మనవరాలు పెళ్ళికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడమే అని కొంతమంది కార్యకర్తలు బహిరంగంగానే గుసగుసలాడుకుంటున్నారు.మల్లారెడ్డి యూనివర్సిటీ, మల్లారెడ్డి కాలేజీలు ఇలా భారీ ఎత్తున విద్యాసంస్థలు ఉన్న మల్లారెడ్డి ప్రభుత్వంతో కొరివి పెట్టుకోవడం ఎందుకు అని సైలెంట్ గా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఆయనే భారతీయ జనతా పార్టీలోకి వెళదామని ఆలోచన కూడా చేసినట్లు కార్యకర్తలు అంటున్నారు. అది కుదరక కాంగ్రెస్ కండువా కప్పుకోనైన వ్యాపారాలు కాపాడుకుందాం అనుకుంటే, అక్కడ అడ్డుపుల్ల పడిందంట..! మనవరాలు పెళ్ళికి ముఖ్యమంత్రి హాజరు కావడం, పెళ్లి కార్డు పేరుతో ఇటు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలవడం, మొత్తానికి మల్లన్న ఏదో సెట్టింగ్ చేసుకున్నారని పార్టీలో గుసగుస. అందుకోసమే గులాబీ పార్టీలోనే ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కడ మాట్లాడకుండా ఉంటున్నారట. అసలు హడావుడి కనిపించడం లేదట.ఇదిలావుంటే, బీఆర్ఎస పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎప్పుడో ఒకసారి కనిపిస్తున్నారు మాజీ మంత్రి మల్లారెడ్డి. మీడియాకు ఎప్పుడు అందుబాటులో ఉండి, సోషల్ మీడియాకు కావలసినంత మసాలా అందించే ఈ మాస్ మల్లన్న ఇప్పుడు మాత్రం కొద్ది రోజులు బ్రేక్ అంటున్నాడట.

## చకచకా సన్నాల మిల్లింగ్..

### ఉగాది నుంచి రేషన్ కార్డులపై సన్నబియ్యం..!!

- పంపిణీకి రెడీ అవుతున్న సివిల్ సప్లయ్స్ శాఖ
- బియ్యం, నూక శాతంపై మిల్లర్లతో చర్చలు కొలిక్కి
- ప్రతినెలా 1.75 లక్షల నుంచి 2 లక్షల టన్నుల బియ్యం అవసరం
- ఏడాదికి అవసరాలు 22 లక్షల టన్నులకు పైగానే..
- వానాకాలం సేకరించిన సన్నవడ్లు 24.18 లక్షల టన్నులు
- 6 నెలల వరకు బేఫికర్.. మిగతా అవసరాలకు వచ్చే యాసంగి ధాన్యం

జయభేరి, హైదరాబాద్ :



రాష్ట్రంలో సర్కారు పేద వర్గాలకు రేషన్పై సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో సివిల్ సప్లయ్స్ డిపార్ట్మెంట్ ఆ దిశగా కసరత్తు మొదలెట్టింది. మిల్లర్లతో చర్చలు జరిపి సన్నబియ్యం మిల్లింగ్ చకచకా జరిగేలా చూస్తున్నది. ఇప్పటికే 3 లక్షల టన్నుల మిల్లింగ్ చేసిన సన్నబియ్యం మిల్లింగ్ చేసి పంపిణీకి సిద్ధం చేసింది. ప్రభుత్వం ఎప్పటి నుంచి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంటుందో దాన్ని బట్టి అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఇప్పటికే బియ్యం, నూక శాతంపై రాష్ట్రంలోని రా రైస్ మిల్లర్లతో చర్చలు కొలిక్కి రావడంతో రేషన్ పంపిణీకి అవసరమైన సన్న బియ్యాన్ని వేగంగా మిల్లింగ్ పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నది. ప్రస్తుతం ఉన్న 90 లక్షలకుపైగా రేషన్‌కార్డులకు నెలకు 1.75 లక్ష టన్నుల సన్న బియ్యం అవసరం ఉంటుంది. వన్ నేషన్ వన్ రేషన్ స్కీమ్, కొత్తగా ఇచ్చే రేషన్ కార్డులు.. ఇలా అన్ని కలిపినా నెలకు 2 లక్షల టన్నులలోపే అవసరమవుతాయని అంచనా వేస్తున్నది.

**బోనస్తో సేకరించిన ధాన్యం మిల్లింగ్**

గత వానాకాలం సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి రూ.12,503 కోట్ల విలువైన 53.91 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. రైతులకు రూ.12,389 కోట్లు ఇప్పటికే చెల్లించింది. అందులో దొడ్డు రకాలు 29.73 లక్షల టన్నులు కాగా, సన్న ధాన్యం 24.18 లక్షల టన్నులు ఉన్నాయి. ఇప్పటికే రైతులకు దాదాపు 900 కోట్లకు పైగా బోనస్ చెల్లించింది. ఇలా సేకరించిన సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, పేదలకు రేషన్ ద్వారా పంపిణీ చేయనున్నారు. వానాకాలం సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 16.20 లక్షల టన్నుల సన్న బియ్యం సిద్ధమవుతుంది. ఇందులో ఇప్పటికే 3 లక్షల టన్నుల సన్నబియ్యం మిల్లింగ్ పూర్తయింది. రాబోయే రెండు నెలల్లో మరో 5 లక్షల టన్నులు సిద్ధం చేస్తున్నారు.

గత సీజన్ బియ్యంతో 6 నెలల వరకు రేషన్. రాష్ట్రంలో సన్న బియ్యం కోసం ఏడాదికి 34 లక్షల టన్నుల సన్నాల అవసరం ఉంటుంది. అయితే గత వానాకాలం సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన 24.18 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 16.20 లక్షల టన్నుల బియ్యం మాత్రమే రానున్నాయి. ఈ బియ్యం 6 నెలల వరకు రేషన్ పంపిణీకీ సరిపోయే అవకాశం ఉన్నది. ఈ యాసంగి సీజన్లో మరో 10 లక్షల టన్నుల సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే ఏడాదికి సరిపోను సన్న బియ్యం అందుబాటులోకి వస్తుంది. ఈ యాసంగిలోనూ భారీగా వరి సాగు జరుగుతున్న నేపథ్యంలో సన్న ధాన్యాన్ని సర్కారు మళ్లీ బోనస్ ఇచ్చి మరీ సేకరించనున్నది. ఈ రెండు సీజన్లు కలుపుకుంటే రాష్ట్రంలో అవసరాలకు సరిపోనూ ఇంకా మిగిలే అవకాశం ఉంటుందని సివిల్ సప్లయ్స్ అధికారులు అంటున్నారు.

**మిల్లింగ్ వేగవంతం చేస్తున్నాం**

రాష్ట్రంలో మిల్లర్లతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ మిల్లింగ్ను వేగంతం చేస్తున్నాం. గతంలో 48 లక్షల టన్నుల ధాన్యం మిల్లింగ్ పెండింగ్లో ఉంటే 31.85 లక్షల టన్నులు మిల్లింగ్ చేయించాం. 29.65 లక్షల టన్నుల బియ్యాన్ని మిల్లర్ల నుంచి సేకరించాం. 2.25 లక్షల టన్నులు జనవరిలోనే సేకరించినం. 48 లక్షల టన్నుల పెండింగ్ను నేడు కేవలం 90 వేలకు తగ్గించగలిగాం. రేషన్ పంపిణీ కోసం సన్న ధాన్యం మిల్లింగ్ చేసి 3 లక్షల టన్నులు సిద్ధం చేశాం. ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం ప్రకటించినా సన్నబియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినం. వచ్చే సీజన్లో సన్న ధాన్యం సేకరించి రాష్ట్ర అవసరాలకు తగిన సన్న బియ్యం ఏర్పాట్లు చేస్తాం.

## ఫ్రీ బస్సు భారమా...




జయభేరి, హైదరాబాద్, జనవరి 29:

తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సుకు భారంగా మారిందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాలు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చాయి. అనేక డిమాండ్లను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం విఫలమయిందని ఆరోపిస్తున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెట్టినందునే తాము సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని చెబుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో సమ్మె చేయడంతో ఆయన ఆర్టీసీ కార్మికుల డిమాండ్లకు తలొగ్గ లేదు. పైగా ఆర్టీసీపై కఠిన నిర్ణయం తీసుకుంటానని ప్రకటించడంతో పాటు యూనియన్లను కూడా రద్దు చేయాలని నిర్ణయించారు. దీనికి కారణం మహిళలకు ఉచిత బస్సు పథకమేనని కార్మిక సంఘాలు అంటున్నాయి. ఉచిత కోచింగ్ హామీలు అమలు చేయకుండా... తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే అది ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దాదాపు మూడున్నర లక్షల మంది వరకూ ఉన్న ఆర్టీసీ కార్మిక కుటుంబాలను మంచి చేసుకునేందుకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. అయితే రెండు పీఆర్సీలు ఇంత వరకూ చెల్లించలేదు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనంచేయలేదు. సీసీఎస్, పీఎఫ్ డబ్బులు 2,700 కోట్ల చెల్లింపులు చేయడంతో పాటు ఇరవై ఏడురకాల తమ డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. ప్రధానంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రయివేటు పరం చేయడాన్ని వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పై కూడా ఆర్టీసీ కార్మికసంఘాలు గుర్రుగా ఉన్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, 2021 జీతభత్యాల సవరణ, కండక్టర్ డ్రైవర్ల ఉద్యోగ భద్రత, విద్యుత్ బస్సులు ప్రభుత్వమే ఆర్టీసీ కొనుగోలు చేసి ఇవ్వాలన్నది కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్లుగా వినిపిస్తున్నాయి. వీటిని పరిష్కరించకపోతే ఫిబ్రవరి 9వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని ఆర్టీసీ కార్మిక సంఘాలు హెచ్చరించాయి. అయితే ప్రధానంగా మహిళలకు ఉచిత బస్సు విధానంతోనే ఆర్టీసీ మరింత నష్టాల్లోకి వెళుతుందని, ప్రభుత్వం నెలకు నాలుగు వందల కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లించాల్సి రావడంతో కార్మిక సంఘాల డిమాండ్లను పక్కన పెట్టిందని వారు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు తెలంగాణలో సమ్మెనోటీసు ఇవ్వడంతో వారితో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు సిద్ధమయినట్లు తెలిసింది. త్వరలోనే వారితో చర్చలు జరిపి సమ్మెను విరమింప చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించనుంది.




# ఈ సుకుమారి తళుకుకి వెన్నెల కూడా సరితూగదు..

అతుల్య రవి కోయంబత్తూరుకి చెందిన నటి. ఆమె ప్రధానంగా తమిళ చిత్రాలలో నటిస్తుంది. ఆమె 2017లో చలనచిత్ర అరంగేట్రం చేసింది. తర్వాత కొన్ని తమిళ సినిమాల్లో కథానాయకిగా ఆకట్టుకుంది. తెలుగులో కూడా సుపరిచితురాలు. ఈ బ్యూటీ గురించి కొన్ని విషయాలు మీ కోసం.... 21 డిసెంబర్ 1994లో తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జన్మించింది అతుల్య రవి. ఈమె అసలు పేరు దివ్య. తమిళనాడులోని కోయంబత్తూరులోని వివేకం మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించింది. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులోని కర్పగం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివింది. చెన్నైలోని SRM ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో, కోయంబత్తూరులోని శ్రీ కృష్ణ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో చదువుకుంది. 'పల్వాది కాదల్' అనే ఓ తమిళ యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ ద్వారా నటనలో కెరీర్ ప్రారంభించింది ఈ వయ్యారి భామ. 2017లో కాదల్ కన్ కట్టుదే అనే ఓ తమిళ చిత్రంలో కథానాయకిగా సినీ అరంగేట్రం చేసింది ముద్దుగుమ్మ అతుల్య రవి. 2018లో V. Z. దుర్తై యేమాలిలో ప్రధాన పాత్రలో నటించింది. తర్వాత ఎన్నో హిట్ చిత్రాల్లో నటించింది ఈ చిన్నది. 2023లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరంకి జోడిగా మీటర్ అనే చిత్రంతో హీరోయిన్‌గా తెలుగుతెరకు పరిచయం అయింది ఈ బ్యూటీ.






# 'హత్య' చేసిందెవరు ?

ధన్యబాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవివర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హత్య'. శ్రీవిద్యా బసవ దర్శకురాలు. ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హత్యా రహస్యం చుట్టూ అల్లుకున్న ఈ కథ ఆద్యంతం ఉత్కంఠను పంచుతుందని.. సుధ, సలీమా పాత్రల్లో ధన్యబాలకృష్ణ, పూజా రామచంద్రన్ అద్భుతమైన నటనను కనబరిచారని దర్శకురాలు పేర్కొంది. ఈ సినిమా ద్వారా తెలుగు ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని పూజా రామచంద్రన్ తెలిపింది. నిర్మాణపరంగా మంచి క్వాలిటీతో తెరకెక్కించామని చిత్ర నిర్మాత ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

# తండేల్‌కు సాయి పల్లవి మ్యాజిక్ వర్కవుట్ అవుతుందా..?

ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫిదా'
సాయి పల్లవి.. కుర్రకారులో ఈ పేరుకు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భానుమతి ఒక్కటే పీస్, హైబ్రీడ్ పిల్ల అంటూ
చిత్రంతో నాయికగా పరిచయమైన ఈ అందాల తార తొలిచిత్రంతోనే యువ ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమాల విషయంలో
తొలిచిత్రంలో సందడి చేసిన సాయి పల్లవి.. మొదటి సినిమాతోనే వచ్చిన క్రేజ్‌ను ఎప్పుడూ క్యాష్ చేసుకోవాలనుకోలేదు. నానితో
చాలా సెలెక్టివ్‌గా తన మనసుకు నచ్చిన కథలనే చేసుకుంటూ వెళుతుంది. అందుకే ఈ కథానాయికకు తెలుగు నాట కూడా ఇంత క్రేజ్, 'అమరన్'
నటించిన ఏమ్‌సీఏ, ఇటీవల వచ్చిన 'అమరన్' చిత్ర విజయాల్లో సాయి పల్లవి మ్యాజిక్ వర్కవుట్ అయ్యిందనే చెప్పాలి. ముఖ్యంగా
చిత్రానికి ఎటువంటి పబ్లిసిటి లేకపోయినా, కేవలం సాయి పల్లవి క్రేజ్‌తోనే ఆ చిత్రం తమిళంలో కంటే తెలుగులోనే ఎక్కువ వసూళ్లను సాధించింది. గీతా
ఇక తాజాగా ఈ క్రేజీ నాయిక నటిస్తున్న చిత్రం 'తండేల్'. నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ చిత్రానికి
ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి
ఈ రోజు బజ్ రావడానికి సాయి పల్లవి కూడా ఓ ముఖ్య కారణం. తెలుగులో ఆమెకున్న క్రేజ్ ఖచ్చితంగా ఈ చిత్రం మంచి ప్రారంభ వసూళ్లు సాధించ
డానికి ఉపయోగపడుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. మంగళవారం విడుదలైన ఈ చిత్రం ట్రైలర్‌లో నాగచైతన్య, సాయి పల్లవి మధ్య
కెమిస్ట్రీ కూడా చూడ ముచ్చటగా ఉంది. ట్రైలర్ కూడా ఆసక్తికరంగా ఉంది. ఇక సాయి పల్లవి మ్యాజిక్ ఈ చిత్రానికి ఎలాగు ఉంది. కాబట్టి తప్పకుండా
ఈ చిత్రం మంచి ప్రారంభ వసూళ్లు సాధిస్తుందని, సాయి పల్లవి ఛరిష్మా, మ్యాజిక్ ఈ చిత్రానికి ప్లస్ అవుతుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com